

ఉప్పొంగిన సంద్రం 8లో..
- నీట మునిగిన వరి పొలాలు
- ఆక్వా సాగుకు తీవ్ర నష్టం

దెబ్బతిన్న బోట్ల మరమ్మతుల్లో మత్స్యకారులు

దూరవిద్య డిగ్రీ పరీక్ష ఫలితాలు విడుదల 6లో..

ఉబికి వస్తున్న కన్నీరు



మగ్గాల గుంతల్లోకి ఉబికి వచ్చిన ఊటనీరు..

- నిండా మునిగిన నేతన్న!
- వర్షాలకు ఆగిన మగ్గం
- ఊటెక్కిన మగ్గం గుంతలు
- పనులు లేక పస్తులతో జీవనం
- మొంథా తుపానుతో మరింత దిగజారిన వైనం
- ప్రభుత్వ చేయూత కోసం నేతన్నల చూపు

ఎలా బతకాలో అర్థం కావడం లేదు



వర్షాల వల్ల నాలుగు నెలలుగా పని చేయలేకపోతున్నాం. నెలకు రూ. 5వేల పని కూడా సాగడం లే దు. దీంతో అప్పులు చేయాల్సి వ స్తోంది. తుపానుతో మొత్తం పరిస్థితి తలకిందులైంది. ఏం చేయాలో పాలుపోవడం లేదు.

వెంకటేశ్వర్లు, తోటవారిపాలెం

ప్రభుత్వం ఆదుకోకపోతే కష్టమే




తుపాను కారణంగా మగ్గం గుంతల్లోకి నీరు చేరింది. ఆ నీరు ఇంకడానికి కనీసం రెండు, మూడు నెలలు పడుతుంది. ఇప్పటికే నాలుగు నెలలుగా పనులు లేవు. ఇంకో మూడు నెలలు పనులుండవు. పడుగు, పేకలు పాడైపోతాయి. ప్రభుత్వం సా యం చేయకపోతే బత కడం కూడా కష్టమే.

- అవ్వారు కుమార్, చంద్రమౌళి నగర్

చీరాల, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కిందటి నెల కురిసిన వర్షాలకు ఆగిన మగ్గం మొంథా తుపాను ధాటికి మరో నెలరోజుల వరకూ కదిలే పరిస్థితి లేకుండా పోయింది. రెక్కాడితేగానీ డొక్కాడని నేతన్నల బతుకులు కకావికలమయ్యాయి. ఈ ఏడాది కురిసిన భారీ వర్షాలకు పీకల్లోతు కష్టాల్లో మునిగిపోయిన చేనేత కార్మికులను మొంథా తుపాను పూర్తిగా ముంచేసింది.

25 వేల కుటుంబాలపై ప్రభావం

చేనేత మనుగడ సాగించాలంటే వాతావరణం సమతుల్యంగా ఉండాలి. ఎండలు మండినా, వానలు కురిసినా చేమగ్గం ఆగిపోతుంది. ఈ ఏడాది వర్షాల తాకిడికి (మిగతా 8వ పేజీలో)



ఉపాధి లేక..అప్పుల పాలు

ఇప్పటికే నెలల తరబడి పనులు కోల్పోయి అల్లాడుతున్న చేనేత కార్మికులకు తుపాను దెబ్బ శరాఘాతంగా పరిణమించింది. కనీస ఆదాయం కూడా పొందలేని సగటు చేనేత కుటుంబాలు కొంత కాలంగా అర్ధాకలితో అల్లాడుతున్నాయి. అప్పులపాలవుతున్నాయి. ఈ పరిస్థితి నుంచి నేతన్నలు బయటపడాలంటే ప్రభుత్వం నుంచి వారికి సహాయం అందాలి. లేదంటే పరిస్థితి మరింత దిగజారే ప్రమాదం ఉంది.



సీతానగరం రైల్వే బ్రిడ్జి వద్ద వరద ఉధృతి

ఉధృతంగా కృష్ణమ్మ

- బ్యారేజి వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక
- 69 గేట్లు ఎత్తి 4.56 లక్షల క్యూసెక్కులు విడుదల

తాడేపల్లి టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): భారీవర్షాల కారణంగా ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటి విడుదలతో కృష్ణానదిలో ప్రవాహం ఉధృతంగా ఉంది. ప్రకాశం బ్యారేజి వద్ద వరద భారీగా పెరిగింది. పులిచింతల ప్రాజెక్టుతోపాటు మున్నేరు, వెలగలేరు, కీసర తదితర వాగుల నుంచి శుక్రవారం 4లక్షల 56 వేల 400 క్యూసెక్కుల వరద నీరు ప్రకాశం బ్యారేజి రిజర్వాయర్ వద్దకు చేరింది. వరద ఉధృతి 4 లక్షల క్యూసెక్కులు దాటడంతో బ్యారేజీ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. బ్యారేజి రిజర్వాయర్‌లో 13.1 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా మొత్తం 69 గేట్లను ఎత్తి దిగువకు అంతే నీటిని విడుదల చేస్తున్నట్టు ఇరిగేషన్ జేఈ రాజేష్ తెలిపారు. వరద అంతకంతకూ పెరుగుతుండడంతో దిగువన నదీ తీరప్రాంతవాసులు, లంక భూముల రైతులు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

వీడని ముంపు

- మూడు రోజులుగా నీటిలోనే పొలాలు
- పంటలను కాపాడుకునే యత్నాల్లో రైతులు
- క్షేత్రస్థాయిలో నష్టం నమోదు ప్రక్రియ ప్రారంభం
- పరిహారానికి అడ్డంకిగా మారిన సాంకేతిక సమస్యలు



రేపల్లె: లంకెవానిదిబ్బలో నీటమునిగిన వరి ఓదెలను చూపెడుతున్న రైతులు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి):

అనేక ఒడి దుడుకులను అధిగ మించి సాగు చేసిన పంట లను మొంథా తుఫాన్ ముంచేసింది. చేతికి అందే దశ లో భారీ వర్షాలు.. రైతుల ఆశలను చిదిమేశాయి. తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలతో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో పొలాలు ముంపునకు గురయ్యాయి. గురు, శుక్రవారాల్లో ఎండ తీవ్రంగా కాసింది. అయితే పొలాలను ముంపు వీడలేదు. మూడు రోజులుగా నీటిలోనే పంటలు నానుతున్నాయి. చెరువులను తలపిస్తోన్న పొలాలను చూసి రైతులు బోరుమంటున్నారు. వీడని ముంపుతో అంతో ఇంతో పంట చేతికి వస్తుందని ఉన్న మిణుకు మిణుకు ఆశలు కూడా ప్రస్తుతం ఆవిరయ్యాయని రైతులు కన్నీటి పర్యంత మవుతున్నారు. రైతన్నకు వచ్చిన పెను కష్టానికి మొంథా విపత్తు ఓ కారణమైతే వ్యవస్థల నిర్లక్ష్యం మరో కారణం గా కనిపిస్తోంది. తుఫాన్ తీవ్రత తగ్గి మూడు రోజులైనా ఇంకా పొలాలు తటాకాలను తలపించడం వెనుక అనేక కాల్వలకు గండ్లు పడడమే కారణంగా నిలిచింది. పంట కాల్వలతో పాటు డ్రెయినేజీల్లో తూటుకాడ, గుర్రపు డెక్క తొలగించే పనుల విషయంలో అనేక ప్రాంతాల్లో నామమాత్రమే. కట్టల పటిష్టత ప్రకటనలకే పరిమితమైంది. ఈ పరిస్థితుల్లో అన్నదాతల రెక్కల కష్టం నీటిపాలైంది. అదే కాల్వలు బాగు చేసి ఉంటే పొలాల్లోని నీరంతా వెళ్లిపోయి.. కొంతైనా పంట చేతికి అందివుండేది. ఇప్పుడు ఆ పరిస్థితి ఎక్కడా లేకపోవడంతో పంటంతా నీటిపాలైంది.

సాయం చేస్తేనే గట్టెక్కుతారు..

రెక్కల కష్టం నీటిపాలై.. అప్పులు కళ్ల ముందు కనిపిస్తోన్న తరుణంలో రైతులు ప్రభుత్వం అందించే సాయం కోసం ఎదురుచూస్తున్నారు. అయితే ఇందులోనూ అనేక ప్రతిబంధకాలు రైతుకు శాపంగా మారనున్నాయా అనే సందేహాలు వెంటాడుతున్నాయి. ముఖ్యంగా ఈ-క్రాప్ నమో దు పూర్తి స్థాయిలో జరగలేదు. ఈ పరిస్థితుల్లో ప్రస్తుత నష్ట పరిహారం పొందేందుకు వివరాలను ఏపీ ఎయిమ్స్ యాప్‌లో నమోదు చేయాలని ప్రభుత్వం సూచిస్తోంది. అయితే ఇందుకు తొలుత ఈ-క్రాప్ తప్పనిసరి అన్న నిబంధన ఉంది. ఇక సీసీఆర్‌సీ (మిగతా 8వ పేజీలో)



బాధితులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేస్తున్న మంత్రి సత్యప్రసాద్

48 మందికి రూ.82.67 లక్షలు పంపిణీ

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేసిన మంత్రి అనగాని

రేపల్లె, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): వైద్య ఖర్చుల నిమిత్తం పేదలు అప్పులు పాలు కాకుండా ఉండాలని ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా సకాలంలో నగదు మంజూరు చేస్తున్నట్లు మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. శుక్రవారం నియోజకవర్గంలోని 48 మంది బాధితులకు సీఎంఆర్‌ఎఫ్, ఎల్‌వోసీ చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న 48 మందికి రూ.82 లక్షల 67 వేలు మంజూరైనట్లు తెలిపారు. 15 నెలల్లో సీఎంఆర్‌ఎఫ్ ద్వారా పేద, మధ్య తరగతి కుటుంబాల వారికి రూ.16 కోట్లు అందించిన ఘనత చంద్రబాబునాయుడిదన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పంతాని మురళీధరరావు, రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు, అనగాని శివప్రసాద్, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త మత్తి భాస్కరరావు, తాతా ఏడుకొండలు, కొలసాని రాము, పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్



పోలీసులతో కలిసి ర్యాలీ చేస్తున్న ఎస్పీ బి.ఉమామహేశ్వర్

పారిశుధ్యం లోపంతో వ్యాధులు

డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ

బాపట్ల, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీవర్షాల వల్ల పారిశుధ్య లోపంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ అపరిశుభ్రత, తాగునీరు కలుషితం వల్ల ప్రజలు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందన్నారు. ఈ పరిస్థితుల్లో అంటువ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కాచిచల్లార్చిన నీటిని తాగాలన్నారు. నీటి వనరులు కలుషితం కాకుండా చూసుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. నిల్వఉన్న ఆహార పదార్థాలను తీసుకోరాదని చెప్పారు. ఎవరైనా అనారోగ్యానికి గురైతే ఆశాకార్యకర్తను, ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలన్నారు.

పునరావాస కేంద్రాల్లోని వారికి సాయం

కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశాలు

బాపట్ల, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందిన వారికి సాయం అందించాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. శుక్రవారం అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తుఫాన్ బాధితులకు ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయ ప్రక్రియను పక్కాగా నిర్వహించాలన్నారు. పునరావాస కేంద్రంలో ఉన్న ప్రతి కుటుంబానికి 25 కిలోల బియ్యం, కేజీ చొప్పున చక్కెర, పామాయిల్, కందిపప్పు అందజేయాలన్నారు. జిల్లాలో 12,671 మంది మత్స్యకార, 8,567 చేనేత కార్మిక కుటుంబాలకు 50 కిలోల బియ్యం, కిలో పంచదార, కందిపప్పు, పామాయిల్ లీటరు అందజేశామన్నారు. రాత్రి పూట పునరావాస కేంద్రంలో ఉన్నవారికి ఆర్థికసాయం అందజేయాలన్నారు. ఆర్థిక సాయం పంపిణీలో లబ్ధిదారులకు ఫోన్, బ్యాంక్ ఖాతా, ఆధార్ నెంబరు తప్పనిసరన్నారు. బ్యాంక్ ఖాతా లేనివారికి చేతికి నగదు అందజేస్తామన్నారు. సమావేశంలో డీఆర్‌వో జి.గంగాధర్‌గౌడ్, కలెక్టరేట్ ఏవో మల్లికార్జునరావు, సీపీవో ఎ.షాలెంరాజు, మత్స్యశాఖ ఏడీ శ్రీనివాస్‌నాయక్, జిల్లా కోఆర్డినేటర్ యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం అందరి బాధ్యత

- పోలీసు అమరవీరుల సంస్మరణలో ఎస్పీ
- బాపట్లలో కొవ్వొత్తుల ర్యాలీ.. మానవహారం

బాపట్ల, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): రక్తదానం చేయడం ప్రతిఒక్కరూ బాధ్యతగా భావించాలని ఎస్పీ బి.ఉమామహేశ్వర్ తెలిపారు. పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమాల్లో భాగంగా బాపట్ల రైల్వేస్టేషన్ సమీపంలోని ఓ ఫంక్షన్ ప్లాజాలో శుక్రవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. పోలీసులతో పాటు యువత పెద్దసంఖ్యలో రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రక్తదానం మరొకరికి ప్రాణదానం అవుతుందన్నారు. దేశంలో రక్తనిల్వలు చాలా తక్కువగా ఉన్నాయన్నారు. రోడ్డు ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన వారికి శస్త్రచికిత్సల సమయంలో రక్తం అందక మృతి చెందుతున్నారన్నారు. రక్తదానంతో ఇలాంటి వారెందరికో ఉపయోగపడుతుందన్నారు. తరుచుగా రక్తదానం వల్ల ఆరోగ్యానికి ఎంతోమంచిదని చెప్పారు. రక్తదానం వల్ల శరీరంలో కొత్తరక్తం ఏర్పడుతుందన్నారు. రక్తదానం చేసిన వారిని అభినందించి వారికి పండ్లు, జ్యూస్ అందజేశారు.

అమరవీరులకు జోహార్లు

పోలీసు అమరవీరుల సంస్మరణ ముగింపు కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఎస్పీ బి.ఉమామహేశ్వర్ ర్యాలీని ప్రారంభించగా, అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, వారికి జోహార్లు అర్పిస్తూ నినాదాలతో ర్యాలీ సాగింది. అనంతరం గడియార స్తంభం సెంటర్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. ఈ కార్యక్రమాల్లో ఏడీఎంహెచ్‌వో వి.సోమలనాయక్, డీఎస్పీలు జి.రామాంజనేయులు, విజయసారథి, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ జి.నారాయణ, సీఐలు ఆర్.రాంబాబు, శ్రీనివాసరావు, హరికృష్ణ, ఆర్ఐ శ్రీకాంత్, ఎస్ఐలు, సిబ్బంది, చీరాల ఏరియా హాస్పిటల్ వైద్యుడు డాక్టర్ భారత్ రాజేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాపట్లలో రేపు మాస్టర్స్ అథ్లెటిక్స్ ఎంపికలు

బాపట్ల, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ ఎంపికలు ఆదివారం బాపట్ల ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల గ్రౌండ్‌లో ఉదయం 10 గంటలకు ప్రారంభమౌతాయని మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రటరి షేక్.నజీర్ తెలిపారు. 30 నుంచి వంద ఏళ్లలోపు క్రీడాకారులు స్త్రీ, పురుషులు ఈ ఎంపిక పోటీలకు హాజరు కావచ్చన్నారు. ఇక్కడ ప్రతిభ చూపిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఈ ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు ఆధార్‌కార్డు జిరాక్స్, పాస్‌పోర్టుసైజ్ ఫోటోతో రావాలన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన వారు డిసెంబరు 13, 14 తేదీల్లో రాష్ట్రస్థాయి పోటీలకు అర్హులన్నారు.

దూరవిద్య డిగ్రీ పరీక్ష ఫలితాలు విడుదల

ఏఎన్‌యూ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రం డిగ్రీ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను శుక్రవారం విడుదల చేసినట్లు డైరెక్టర్ ఆచార్య వంకాయలపాటి వెంకటేశ్వర్లు, పరీక్షల విభాగ కో-ఆర్డినేటర్ ఆచార్య డి. రామచంద్రన్ తెలిపారు. నవంబరు 12వ తేదీలోగా రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులు అందజేయాలని సూచించారు. పేపర్‌కు రూ. 770 ఫీజు చెల్లించాలని వెల్లడించారు. వివరాలను వర్సిటీ వెబ్‌సైట్ నుంచి పొందవచ్చని తెలిపారు.

8 క్రస్ట్‌గేట్ల ద్వారా సాగర్ నీటి విడుదల

విజయపురిసౌత్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఎగువన శ్రీశైలం ప్రాజెక్ట్ నుంచి వరద నీరు వచ్చి చేరుతుండడంతో శుక్రవారం నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ అధికారులు ప్రాజెక్ట్ 8 క్రస్ట్‌గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం నీటిమట్టం 589.80 అడుగులు ఉంది. ఇది 311.44 టీఎంసీలకు సమానం.




8 క్రస్ట్ గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

కుడి కాలువ ద్వారా 2053, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 28,704, 8 క్రస్ట్ గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 64,632 మొత్తం ఔట్‌ఫ్లో 95,389 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 95,389 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

0.4575 ఎంయూల విద్యుదుత్పత్తి

రెంటచింతల,అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని కృష్ణా నదిపై నిర్మితమైన నాగార్జున సాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో గురువారం అర్ధరాత్రి 12 గంటల వరకు రెండు యూనిట్ల ద్వారా 0.4575 ఎంయూల విద్యుదుత్పత్తి జరిగినట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టుకున్న 20 రేడియల్ క్రస్ట్ గేట్లకు గాను 5 గేట్లను 3 మీటర్ల మేర ఎత్తి 78,425 క్యూసెక్కులు టేల్ రేస్ చానల్ ద్వారా 4346 క్యూసెక్కులు మొత్తంగా 82,771 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నారు. ఎగువన సాగర్, ఎత్తిపోతల, హాలియా వాగుల నుంచి 86,597 క్యూసెక్కుల నీరు వస్తుందన్నారు.రిజర్వాయర్‌లో 75.50 మీటర్ల మేర నీరుండగా ఈ నీరు 7.080 టీఎంసీలకు సమానమన్నారు.

చప్టాలపై వరద ప్రవాహం



అరవింద వారధి వద్ద కొనసాగుతున్న వరద ఉధృతి



గాజుల్లంక వద్ద వరద ఉధృతికి నిలిచిపోయిన మత్స్యకారుల పడవలు

కొల్లూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): కృష్ణానదికి మళ్లీ వరద పోటెత్తింది. గురువారం ఉదయం నుంచి క్రమేపి నదిలో నీటి మట్టం పెరుగుతూ శుక్రవారం ఉదయానికి ఉధృతమైంది. దీంతో మండల పరిధిలోని గాజుల్లంక చినరేవులో వరద నీరు పోటెత్తడంతో దోనేపూడి వద్ద లోలెవల్ చప్టాపై వరద నీరు ప్రవహిస్తోంది. దీంతో అక్కడ రాకపోకలను పోలీసు, రెవెన్యూ అధికారులు నిలిపి వేశారు. ఉదయం 10 గంటల కు కొంతమేర వరద తగ్గుముఖం పట్టినప్పటికీ సాయంత్రం 6 గంటల సమయంలో ప్రకాశం బ్యారేజీ నుంచి 4,56,400 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేయడంతో వరద పెరిగే అవకాశాలున్నాయి.

అన్నదాతలను అన్ని విధాలా ఆదుకుంటాం

ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్

కొల్లూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): తుపాను, వరదల వల్ల పంటలు నష్టపోయిన రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ శుక్రవారం పేర్కొన్నారు. భట్టిప్రోలు మండలంలోని చింతమోటు, పెసర్లంక, పెదలంక, గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను ఆయన పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో రేపల్లె, వేమూరు నియోజకవర్గ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీ మాట్లాడుతూ వరదలు, తుఫాన్ వల్ల ఈ ప్రాంతంలో పంటలకు అపార నష్టం కలిగింద న్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ముందు చూపుతో ప్రజ లకు ఎలాంటి ఇబ్బందులు కలగలేదన్నారు. రేపల్లె, వేమూరు నియో జకవర్గాల్లో సుమారు 40 కిలోమీటర్లు రోడ్డు దెబ్బతిందని, పునర్నిర్మాణానికి రూ.40 కోట్లు ఖర్చు అవుతుందని ప్రాథమిక అంచనా వేయడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం సాగు, డ్రెయినేజ్ కాల్వల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పూడికతో నిండిపోయాయన్నారు. వీటిని అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. పడిపోయిన విద్యుత్ స్తంభాలు 239 ఉన్నాయని, వాటి స్థానాల్లో కొత్తవి ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో బియ్యం, ఆయిల్, చక్కెర సరఫరా చేస్తున్నట్లు ఎంపీ తెలిపారు. రైతులకు నష్టపరిహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని అ ధికారులను ఆదేశించారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న కుటుంబాలకు వెయ్యి రూపాయల నుంచి గరిష్ఠంగా రూ.3 వేలు ప్రభుత్వం అందజేస్తుందని చెప్పారు. డిప్యూటీ కలెక్టర్ నాగిరెడ్డి, ఆర్డీవో రామలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్

రైతు నష్టం పూడ్చలేనిది

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు



వరద ముంపునకు గురైన మిర్చి పైరును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

యడ్లపాడు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు పత్తి, మిర్చి పంటలు పూర్తిగా దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారని, వారికి కలిగిన నష్టం పూడ్చలేనిదని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. శుక్రవారం యడ్లపాడు మండలంలోని తిమ్మాపురం, సొలస, నాదెండ్ల మండలంలోని జంగాలపల్లి, నాదెండ్ల గ్రామాల్లో ఆయన పర్యటించారు. తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న పత్తి, మిరప పంటలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి జరిగిన పంట నష్టం..పెట్టుబడి వ్యయం తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భగా ప్రత్తిపాటి మాట్లాడుతూ రైతులు కోలుకోవాలంటే ఇన్‌పుట్ సబ్సిడీ పెంచాలన్నారు. ఏ రైతును కదిలించినా దీనిని కోరుతున్నారని చెప్పారు. రైతు పక్షపాతి అయిన సీఎం చంద్రబాబునాయుడి దృష్టికి రైతుల అభిప్రాయాలను తీసుకెళతామని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక వనరుల దృష్ట్యా కేంద్ర ప్రభుత్వమే భారాన్ని మోయాలని, ఇన్‌పుట్ సబ్సిడీని పెంచడంతోపాటు ఇన్సూరెన్స్ ఉన్నా లేకున్నా రైతులందరికీ అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. రైతులను కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. వాగులు, వంకలు పొంగి పొర్లడంతో నియోజకవర్గంలోని ఎత్తిపోతల పథకాలు పూర్తిగా దెబ్బతిన్నాయని, మోటార్లు పూర్తిగా మునిగిపోయి పనిచేసే పరిస్థితి లేకుండా పోయిందని ప్రత్తిపాటి తెలిపారు. ఈ పథకాలన్నింటికీ.. యుద్ధప్రాతిపదికన మరమ్మత్తులు చేయాల్సిన అవసరం ఉందన్నారు. రైతులు ఇన్‌పుట్ సబ్సిడీ కింద పరిహారం పొందితే సీసీఐ ద్వారా పత్తికొనుగోలు చేయరంటూ వ్యవసాయ సి బ్బంది అసత్య ప్రచారం చేస్తున్నారంటూ రైతు నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. దీంతో ఆయన వ్యవసాయ అధికారులు, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు లేకుండా అనవసర ప్రచారం చేయొద్దని స్పష్టం చేశారు. ఆయన వెంట జిల్లా తెలుగు రైతు అధ్యక్షుడు మద్దూరి వీరారెడ్డి, మార్కెట్‌యార్డు ఛైర్మన్ కరిముల్లా, టీడీపీ మండల అధ్యక్షుడు కామినేని సాయిబాబు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పది ఫలితాల్లో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలి

నరసరావుపేట కల్చరల్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో జిల్లాను రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలపాలని కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశించారు. శుక్రవారం ఆమె కలెక్టరేట్‌లోని జాషువా సమావేశ మందిరంలో విద్యాశాఖపై సమీక్ష సమావేశం నిర్వహించారు.తొలుత జిల్లాలోని పాఠశాలల ప్రస్తుత పరిస్థితిని సమీక్షించారు. అనంతరం విద్యార్థుల హాజరు, మౌలిక సదుపాయాలు, మధ్యాహ్న భోజన పథకం అమలు, విద్యా ప్రమాణాల పెరుగుదల వంటి అంశాలపై అధికారుల నుంచి సమగ్ర నివేదికలను పరిశీలించారు. పది ఫలితాల్లో జిల్లాను అగ్రస్థానంలో ఉంచడమే కాకుండా ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించే దిశగా కృషి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, విద్యార్థుల హాజరుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ, విద్యాశాఖాధికారులు, హెచ్‌ఎంలు, కేజీబీవీ, ఆదర్శ, గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా, చిత్రంలో డీఈవో చంద్రకళ తదితరులు

సర్దార్ వల్లభభాయ్ పటేల్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

ఏఎన్‌యూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య గంగాధరరావు

ఏఎన్‌యూ, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): సర్దార్ వల్లభాయ్ పటేల్ ను ఆదర్శంగా తీసుకొని నేటి యువత సమాజ సేవలో ముందుకు సాగాలని ఏఎన్‌యూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య గంగాధరరావు అన్నారు. వర్సిటీలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో శుక్రవారం సర్దార్ వల్లభభాయ్ పటేల్ 150వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. పటేల్ జాతి, మత, భాష వ్యత్యా సాలను తగ్గిస్తూ.. భారత దేశ సమగ్రతకు పాటుపడ్డారని పేర్కొన్నారు. రెక్టార్ శివరాం ప్రసాద్ మాట్లాడుతూ.. విభిన్న సంస్థల ను భారత దేశంలో విలీనం చేయడం ద్వారా దేశాన్ని ఐక్యంగా పటేల్ ఉంచారన్నారు. ఐక్యత దినోత్సవం భారతీయ సమైక్యతను గౌరవించడంలో ముఖ్యపాత్ర పోషించిందన్నారు. అనంతరం రాష్ట్రీయ ఏకత దివస్ ప్రతిజ్ఞ చేయించారు. ముందుగా వర్సిటీ ప్రధాన గేటు నుంచి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్ కో-ఆర్డినే టర్ దివ్య తేజోమూర్తి, రిజిస్ట్రార్ జి.సింహాచలం, అధ్యాపకులు పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఇన్‌చార్జి వీసీ ఆచార్య గంగాధరరావు తదితరులు

ఐక్యంగా ఉంటే దృఢంగా ఉంటాం : ఎస్పీ కృష్ణారావు

నరసరావుపేట లీగల్, అక్టోబరు 31(ఆంధ్ర జ్యోతి), ఐక్యంగా ఉంటే దృఢంగా ఉంటామని సందేశాన్ని అందించడమే ఐక్యత దినోత్సవం ముఖ్య ఉద్దేశం అని ఎస్పీ బికృష్ణారావు తెలిపారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా శుక్రవారం పోలీసు ప్రధాన కార్యాలయంలో ఆయ న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా ని వాళులర్పించారు. సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



సిబ్బందితో ప్రతిజ్ఞ చేస్తున్న ఎస్పీ బీ కృష్ణారావు

గ్యాంగ్ రేప్ కేసులో ఇద్దరికి జీవిత ఖైదు

నరసరావుపేట లీగల్, అక్టోబరు 31 (ఆంధ్ర జ్యోతి) : ఓ మహిళపై గ్యాంగ్ రేప్‌కు పాల్పడి, హతమార్చినట్లు నేరం రుజువు కావడంతో నిందితులకు జీవిత ఖైదు విధిస్తూ స్థానిక 13వ అదనపు జిల్లా సెషన్స్ న్యాయాధికారి డాక్టర్ నేతి సత్యశ్రీ శుక్రవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం వివరాలు ఈ విధంగా ఉన్నాయి. పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం గణపవరం గ్రామానికి చెందిన ఓ మహిళ (45) భర్త చనిపోవడంతో గ్రామంలోని పీర్ల చావడిలో ఒంటరిగా నివసిస్తుంది. ఆమె నివాసం వుంటున్న గది పక్కనే గణపవరంలోని ఓ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న ఒడిశా రాష్ట్రంలోని భద్రక్ జిల్లా ఫతేపూర్ మండలం లెంతర గ్రామానికి చెందిన మనోజ్ మాలిక్ నివసిస్తున్నాడు. పనిచేసే ప్రదేశంలో మాలిక్‌కు గణపవరానికి చెందిన మద్దిబోయిన సాంబశివరావు ఎలియాస్ సాయి పరిచయమయ్యాడు. వీరు ఇరువురు కలిసి 2024 ఆగస్టు 8వ తేదీ రాత్రి సదరు మహిళ గదిలోకి అక్రమంగా ప్రవేశించారు. ఆమెపై అత్యాచారం చేసి అనంతరం హతమార్చారు. ఈ మేరకు మృతురాలి కుమార్తె పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు నమోదు చేసుకున్న పోలీసులు ప్రాథమిక దర్యాప్తు అనంతరం నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. విచారణలో నేరం రుజువు కావడంతో పై విధంగా కోర్టు తీర్పును వెలువరించింది.

సిబ్బంది సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

గ్రీవెన్స్‌లో 16 ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ

గుంటూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటామని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ప్రతి శుక్రవారం నిర్వహించే పోలీస్ సిబ్బంది గ్రివెన్స్ డేలో ఆయన పాల్గొని వినతులు స్వీకరించారు. పోలీస్ సిబ్బంది నుంచి 16 వినతులను స్వీకరించి, వాటి పరిష్కారం కోసం తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పోలీస్ శాఖ ఒక కుటుంబం లాంటిదని, సిబ్బంది సంక్షేమానికి తను ఎప్పుడూ అండగా ఉంటానని ఎస్పీ వకుల్ జిందాల్ పునరుద్ఘాటించారు.

జాబ్ మేళాలో 141 మందికి ఉద్యోగాలు



ఆఫర్ లెటర్లు అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు, అధికారులు

తుళ్లూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): తుళ్లూరులోని ఏపీ సీఆర్డీఏ స్కిల్ హబ్ ప్రాంగణంలో శుక్రవారం ప్రత్యేక డ్రైవ్ జాబ్ మేళాను నిర్వహించారు. మొత్తం 627 మంది అభ్యర్థులు హాజరయ్యారు. 141 మంది ఉద్యోగాలు పొందారు. అదనంగా 43 మంది అభ్యర్థులను వివిధ కంపెనీలు షార్ట్‌లిస్ట్ చేశాయి. ఎంపికైన అభ్యర్థులకు ఏపీ సీఆర్డీఏ సామాజిక సంక్షేమ విభాగం డీసీడీఓ శ్రీ బొర్రా శ్రీనివాసరావు.. సంస్థల హెచ్‌ఆర్ ప్రతినిధుల సమక్షంలో ఆఫర్ లెటర్లు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ఏపీఎస్ఎస్‌డీసీ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ అరుణకుమారి, సీఆర్డీఏ సీనియర్ లైవ్లీహుడ్ ఆఫీసర్ శంకర్, జూనియర్ లైవ్లీహుడ్ స్పెషలిస్టులు క్రాంతికుమార్, నరసింహులు, వెంకటేశ్వర్లు సమన్వయం చేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.75 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	132, 141, 152
చికెన్ విత్ స్కిన్(కిలో)	252.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	262.00

32,256 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 29,634 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 32,256 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 5,059 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	10000	12500
334	10000	15200	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	14200	334	10500	15000
273	---	---	నెంబరు. 5	10000	14400
341	10000	16000	273	---	---
4884	---	---	341	10000	16000
సూపర్ 10	---	---	4884	11000	14000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	15000	తేజ	10000	15000
షార్క్-1	-----	----	బ్యాడిగి	10000	15300
బ్యాడిగి	10500	15300	దేవనూరు డీలక్స్	10500	14500
దేవనూరు డీలక్స్	10000	14700	తాలుకాయలు	5000	8000



లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ

పేదల వైద్యానికి ముఖ్యమంత్రి సహాయనిధి

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బాపట్ల నియోజకవర్గంలో అర్హులైన 84 మంది లబ్ధిదారులకు రూ.46,01,179 చెక్కులను వైద్య ఖర్చుల సహాయార్థం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సంక్షేమ నిధి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి వచ్చిన చెక్కులను ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అందజేశారు. ఎమ్మెల్యే నరేంద్రవర్మ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజలకు వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా బాధిత కుటుంబాలకు, నిరుపేద కుటుంబాలకు సీఎం సహాయనిధి అందజేసి అండగా నిలస్తుందన్నారు. సీఎంఆర్ఎఫ్ చెక్కులు పొందినవారిలో బాపట్లకి చెందిన వారు 29 మంది, బాపట్ల మండలానికి చెందిన వారు 43 మంది, కర్లపాలెం మండలానికి చెందిన వారు 8 మంది, పిట్టలవానిపాలేనికి చెందిన వారు నలుగురు ఉన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల మార్కెట్ యార్డు చైర్మన్ కావూరి శ్రీనివాసరెడ్డి, బాపట్ల మండల, పట్టణ టీడీపీ అధ్యక్షులు ముక్కామల సాంబశివరావు, గొలపల శ్రీనివాసరావు, కర్లపాలెం మండల ప్రధాన కార్యదర్శి ఎస్కే బాజి, టీడీపీ నాయకుడు జిట్టా శ్రీనివాసరావు, జనసేన నాయకుడు కారుమూరి అంజనేష్ పాల్గొన్నారు.

నీటి ప్రవాహం సజావుగా జరిగేందుకు చర్యలు తీసుకోవాలి

● రాష్ట్ర ఆర్‌టిజిఎస్, ఐటి కార్యదర్శి కాటంనేని భాస్కర్



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తదితర శాఖలఅధికారులు

బాపట్ల, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి) : తుఫాన్ ప్రభావం వల్ల పొంగిపొర్లుతున్న వాగులు, కాల్వలలో నీటి ప్రవాహం సజావుగా జరిగేవిధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఆర్‌టీజీఎస్, ఐటీ కార్యదర్శి కాటంనేని భాస్కర్ అధికారులను ఆదేశించారు. కోస్తాజిల్లాల కలెక్టర్‌లతో శుక్రవారం అమరావతి సచివాలయం నుంచి ఆయన వీక్షణ సమావేశంలో మాట్లాడారు. తుఫాన్ ప్రభావం వల్ల కాల్వల పర్యవేక్షణ, మరమ్మతులు, ముంపు ప్రాంతాలలో నీటిని తొలిగించటానికి తీసుకోవాల్సిన చర్యలపై ఆయన వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కాటంనేని భాస్కర్ మాట్లాడుతూ తుఫాన్ ప్రభావం వల్ల కోస్తాజిల్లాల్లో పొంగిపొర్లుతున్న కాల్వలు, వాగుల మరమ్మతులు చేపట్టాలని కలెక్టర్‌లకు చెప్పారు. నష్టపోయిన బాధితులకు పరిహారం అందించి నివేదికలను వెంటనే పంపించాలన్నారు. కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో రాబోయే 48 గంటలలో పొంగిపొర్లుతున్న వాగులు, కాల్వల నీటి ప్రవాహం సాధారణ స్థితికి వస్తుందని చెప్పారు. జిల్లాలో తుఫాన్ ప్రభావం వల్ల నష్టపోయిన బాధితులకు పరిహారం అందించటానికి చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఈ కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్‌గౌడ్, జిల్లా వ్యవసాయాధికారి అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆలోచనలకు తగ్గట్టుగా విధులు నిర్వహించాలి

● ప్రాంతీయ సంయుక్త సంచాలకులు టి.కస్తూరిబాయ్



తనిఖీ చేస్తున్న ప్రాంతీయ సంయుక్త సంచాలకులు టి.కస్తూరిబాయ్

బాపట్ల, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆలోచనలకు తగినట్టుగా ఉద్యోగులు బాధ్యతతో విధులు నిర్వహించాలని జోన్-3 సమాచార, పౌరసంబంధాలశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు టి.కస్తూరిబాయ్ తెలిపారు. జిల్లా సమాచార, పౌరసంబంధాలశాఖాధికారి కార్యాలయాన్ని శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలో ఉద్యోగుల హాజరుపట్టీక, పలుదస్త్రాలను ఆమె పరిశీలించి సంతకాలు చేశారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలన్నారు. కార్యాలయంనకు వచ్చే ఉత్తర ప్రత్యుత్తరాల సమాచారం సకాలంలో అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమాచార పౌరసంబంధాల అధికారి పి.వెంకటరమణ, జిల్లా పౌరసంబంధాల అధికారి టి.మోహనరాజు, సహాయ కార్యనిర్వాహక సమాచార ఇంజనీర్ షేక్ మస్తాన్, సిబ్బంది పాల్గొన్నారు.

వర్గీకరణ పేరుతో ఐక్యతపై కుట్ర

● మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ రత్నాకర్



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఆర్ఎస్ రత్నాకర్

బాపట్ల, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణ పేరుతో దళితుల ఐక్యతపై దేశవ్యాప్త కుట్ర జరిగిందని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు, రాక్స్ జాతీయ అధ్యక్షుడుడాక్టర్ ఆర్ఎస్ రత్నాకర్ అన్నారు. పట్టణంలోని సాయి ప్యాలెస్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్గీకరణ చరిత్రలోనే అతిపెద్ద రాజకీయ కుట్ర అని ఆయన అన్నారు. వర్గీకరణ వల్ల కేవలం వందలో నలుగురికి మాత్రమే మేలు జరుగుతుందన్నారు. తెలుగురాష్ట్రాలలో అన్ని రాజకీయపార్టీలు మాలసామాజిక వర్గాన్ని టార్గెట్ చేసి అణిచివేసే ప్రయత్నం చేస్తున్నాయని ఆరోపించారు. దీనిపై మాలప్రజాప్రతినిధులు నోరుమెదకపోవటం ఘోరమైన అన్యాయమన్నారు. సమావేశంలో మేడికొండ సుబ్బయ్య, తానికొండ ఆనందబాబు, చింతా సురేష్ బాబు, బండికళ్ళ రవిబాబు, సక్కి ప్రభంజన్, సంజీవ్, లక్ష్మణ్, కనపర్తి రాజారావు, సూరిబాబు, తనికెళ్ళ నాని తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు జరిపించాలి

● బాపట్ల డిప్యూటీ ఎంపీడీవో జి.రామకృష్ణ



నరసాయపాలెంలో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న రామకృష్ణ

బాపట్లరూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలంలోని అన్ని గ్రామాలలో పూర్తి స్థాయిలో పారిశుధ్య కార్యక్రమాలు, క్లోరినేషన్ ఆయా పంచాయతీల కార్యదర్శులు జరిపించాలని బాపట్ల డిప్యూటీ ఎంపీడీవో జి.రామకృష్ణ అన్నారు. తుఫాన్ అనంతరం గ్రామపంచాయతీలలో చేపట్టాల్సిన అత్యవసర పారిశుధ్య కార్యక్రమాలపై పర్యవేక్షణలో భాగంగా శుక్రవారం నరసాయపాలెం గ్రామపంచాయతీలో జరుగుతున్న కాల్వ పూడికతీత పనులను, పారిశుధ్య కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వమే మెడికల్ కళాశాలలను నిర్మించాలి

● మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి



సంతకాలు సేకరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి, వైసీపీ నాయకులు

బాపట్ల, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి) : పీపీపీ పద్ధతిలో మెడికల్ కళాశాలలను నిర్మించాలనే నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం వెనక్కి తీసుకొని ప్రభుత్వమే నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి డిమాండ్ చేశారు. ఈమేరకు వైసీపీ ఆధ్వర్యంలో చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని శుక్రవారం కొత్తబస్టాండ్ సెంటర్ నుంచి ప్రారంభించారు. ప్రజల వద్దకెళ్ళి సంతకాలు సేకరించి వారికి దీని గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పట్టణ అధ్యక్షుడు కాగిత సుధీర్‌బాబు, నాయకులు జోగి రాజా తదితరులు పాల్గొన్నారు.

తగ్గిన వరద.. తప్పిన పెనుప్రమాదం

● పొలాల నుంచి బయటకు వెళుతున్న నీరు



నల్లమడలో వరదనీటి ఉధృతి తగ్గటంతో పొలాలలోని నీరు డ్రెయిన్‌లోకి వెళుతున్న చిత్రం

బాపట్ల, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ ప్రభావంతో నల్లమడ డ్రెయిన్‌కు వరదనీరు పెద్దఎత్తున చేరి కట్టలు పొంగేవిధంగా ఉధృతంగా ప్రవహించింది. వరదనీటి ఉధృతికి బాపట్ల మండలం మూలపాలెం గ్రామసమీపంలో బలహీనంగా ఉన్న కట్టలు పలుచోట్ల కోతకు గురై గండ్లుపడి వరదనీరు పక్కనే ఉన్న ఫీటిఛానల్ గుండా ప్రవహించింది. దీనివల్ల వరి పైరు పెద్దఎత్తున ముంపునకు గురైంది. మూలపాలెంతోపాటు జిల్లెళ్ళమూడి గ్రామం కూడా ముంపునకు గురవుతుందని అధికారులు, నాయకులు పెద్దఎత్తున ఆందోళన చెందారు. ఆయా గ్రామాల ప్రజలను, అధికారులను అప్రమత్తం చేశారు. శుక్రవారం నాటికి ఎగువ నుంచి వచ్చే వరదనీరు తగ్గటంతో నల్లమడ డ్రెయిన్‌లో వరద ఉధృతి తగ్గింది. దీంతో పొలాల్లోకి వెళ్ళిన వరదనీరు తిరిగి తూముల ద్వారా, గండ్ల ద్వారా నల్లమడలోకి ప్రవహిస్తున్నది. దీంతో పెనుప్రమాదం తప్పింది. కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ సూచనల మేరకు డ్రైనేజి అధికారులు గండ్లు పూడ్చేందుకు ఇసుకగోతాలు సిద్ధం చేశారు. మరలా వరదనీరు వస్తే ప్రమాదం జరగకుండా చర్యలు చేపడుతున్నారు.

500 సీవాల్యూకు పెంచితేనే సమస్యకు శాశ్వత పరిష్కారం

నల్లమడ డ్రెయిన్ సామర్థ్యం కేవలం 22 వేల క్యూసెక్కులు మాత్రమే. ప్రస్తుతం డ్రెయిన్‌లో 42 వేల క్యూసెక్కుల వరదనీరు ప్రవహిస్తున్నది. ఇంకా పెరిగే అవకాశం ఉంది. 2000 సంవత్సరంలో కృష్ణారావు కమిటి సిఫార్సు మేరకు డ్రెయిన్‌ను 300 సీవాల్యూకు పెంచగలిగారు. అయినప్పటికి సమస్య తీవ్రంగా ఉండటంతో 2016వ సంవత్సరంలో కాకుమాను మండలం వచ్చిన నారా చంద్రబాబునాయుడు బహిరంగ సభలో నల్లమడ సివాల్యూ 500కు పెంచుతామని ప్రకటించారు. ప్రస్తుతం దీనికి అడ్మినిస్ట్రేటివ్ శాంక్షన్ వచ్చినప్పటికి డబ్బులు విడుదలకాలేదు. ఫలితంగా వరద ప్రభావాన్ని తట్టుకోలేని విధంగా నల్లమడ డ్రెయిన్ కట్టలు ఉన్నాయి. దీనిని పూర్తి స్థాయిలో ఆధునీకరిస్తేనే సమస్యకు పరిష్కారం ఉంటుంది. ఇప్పటికైన పాలకులు, అధికారులు స్పందించాల్సి ఉంది. దీనిపై దశాబ్దాలుగా నల్లమడ రైతుసంఘం నాయకులు పోరాటం చేస్తూనే ఉన్నారు. సమస్య మాత్రం పరిష్కారం కావటంలేదు.

పటేల్ జీవితం ఆదర్శనీయం

● ఎస్పీ బి.ఉమామహేశ్వర్

● జిల్లా పోలీసు ఆధ్వర్యంలో రన్‌ఫర్ యూనిటీ



జెండా ఊపి రన్ ఫర్ యూనిటి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ బి.ఉమామహేశ్వర్

బాపట్ల, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి) : విశాల భారతావనిని ఏకతాటిపై నడిపించిన సర్దార్ వల్లభాయ్‌పటేల్ జీవితం ఆదర్శనీయమని ఎస్పీ బి.ఉమామహేశ్వర్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం పటేల్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలీసు అధికారులతో కలిసి ఆయన పటానికి పుష్పాంజలి ఘటించి జాతీయ ఐక్యత దినోత్సవం సందర్భంగా రన్‌ఫర్ యూనిటి కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా పోలీసు కార్యాలయం దగ్గర నుంచి 2కిలోమీటర్లు వరకు రన్‌ఫర్ యూనిటి నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ దేశ చరిత్రలోనే పటేల్ అపూర్వమైన నాయకుడని అన్నారు. రన్‌ఫర్ యూనిటి కార్యక్రమం శాంతి భద్రతల గురించి, దేశభద్రత గురించి ప్రజలలో చైతన్యం తీసుకురావటానికి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ జి.రామాంజనేయులు, సీసీఎస్ డీఎస్పీ పి.జగదీష్‌నాయక్, ఏఆర్ డీఎస్పీ పి.విజయసారధి, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ జి.నారాయణ, పట్టణ సీఐ ఆర్.రాంబాబు, రూరల్ సీఐ కె.శ్రీనివాసరావు, సర్కిల్ సీఐ బి.హరికృష్ణ, ఆర్ఐలు షేక్ మౌలుద్దీన్, శ్రీకాంత్, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.



పటేల్ పటానికి పుష్పాంజలి ఘటిస్తున్న కమిషనర్ జి.రఘునాథరెడ్డి తదితరులు

● బాపట్ల, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : ధృడమైన సంకల్పం, అచంచల నాయకత్వం సర్దార్ వల్లభాయ్‌పటేల్‌కు సొంతమని మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి అన్నారు. బాపట్ల మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం పటేల్ జయంతి సందర్భంగా ఆయన పటానికి పుష్పాంజలి ఘటించి అక్కడ జరిగిన సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ దేశ ఐక్యతకు పటేల్ విశేష కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ పి.లక్ష్మయ్య, ఆర్ఐ షేక్ ఇమామ్, సర్వేయర్ పి.మాధవి, సిబ్బంది పాల్గొన్నారు.

● మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్రఅధ్యక్షులు తాండ్ర సాంబశివరావు, చత్రపతిశివాజి స్మారక సేవాసమితి ఆధ్వర్యంలో శుక్రవారం భారత్‌ఏక్తా ర్యాలీని భారీ ఎత్తున నిర్వహించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకొని నిర్వహించిన ఈ ర్యాలీని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ప్రారంభించగా వివిధ రాజకీయపార్టీల నాయకులు, సమాజ సేవకులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ ర్యాలీలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొండమూది బంగారుబాబు, మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావులు, వల్లభాయ్‌పటేల్ సేవలు గురించి వివరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జీవీఎల్ మోహన్‌గౌడ్, ఎస్‌బీఎస్‌జి తిలక్, కొత్రా వెంకటరామకృష్ణ, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరాజు, శర్మ, మాజీ సైనిక సంక్షేమ సంఘం నాయకులు పుట్టా ఆదిశేషారెడ్డి, సీహెచ్ వెంకటకృష్ణారావు, సారధి, డి.వెంకటేశ్వర్లు, పి.ప్రసాద్ పాల్గొన్నారు.

● బాపట్లరూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ ఐక్యత దినోత్సవం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.రమాదేవి మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడు, భారత తొలి హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని కళాశాలలో జరుపుకున్నామన్నారు. కళాశాల డీన్ స్టూడెంట్ అఫైర్స్ ప్రొఫెసర్ డి.నిరంజన్‌బాబు మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్‌పటేల్ దేశ సమైక్యత సారధి అని, విద్యార్థులు జాతీయ సమైక్యత వాదం పెంపొందించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం అనంతరం విద్యార్థులు ఐక్యత నడక, ఐక్యత పరుగు, జాతీయ సమైక్యత ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ వై.శృతి, జి.నాగరాజు, శ్రీధర్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

● బాపట్ల, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి) : దేశ సమైక్యతకు, సమగ్రతకు పాటుపడిన వారిలో సర్దార్ వల్లభాయ్‌పటేల్ అగ్రగణ్యులని ఫోరం ఫర్‌బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు అన్నారు. సర్దార్ వల్లభాయ్‌పటేల్ జయంతిని పటేల్ నగర్‌లోని ఆయన విగ్రహం వద్ద శుక్రవారం ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి పటేల్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి అక్కడ జరిగిన సమావేశంలో సాయిబాబు మాట్లాడుతూ భారతదేశ ఏకీకరణలో ఆయన అద్భుతమైన పాత్రను పోషించారన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు యు.మెర్సీ జాకబ్, సబ్ పోస్ట్‌మాస్టర్ అజయ్‌కుమార్, ఉపాధ్యాయులు పద్మ, సుశీల, నాగమణి, ఎన్.వెంకటేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

● కర్లపాలెం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : సర్దార్ వల్లభాయ్ పటేల్ 150 జయంతి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ రజని, వ్యవసాయాధికారి సుమంత్‌కుమార్, మండల పరిషత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● చెరుకుపల్లి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి) : సర్దార్‌వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా జాతీయ ఏక్తాదివస్‌లో భాగంగా చెరుకుపల్లి ఎస్ఐ టి.అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం పోలీస్‌సిబ్బంది యూనిటీ ఫర్ రన్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల మధ్య ఐక్యత పెంచడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు.

● రేపల్లె, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి) : భారతీయులంతా ఐక్యతగా ఉండి ఒకరికి ఒకరు సత్సంబంధాలతో మెలగాలని డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఏక్తా దివాస్ యూనిటీ 2కేరన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆశయాలను అనుగుణంగా ప్రతి ఒక్కరూ నడుచుకోవాలన్నారు. ఆయన స్ఫూర్తితో యువత ముందుకు వెళ్ళాలని సూచించారు. సర్దార్ వల్లభాయ్‌పేటల్ 150వ జయంతి సందర్భంగా ప్రజల మధ్య సంబంధాలు కొనసాగించేలా ప్రతి ఒక్కరూ నడుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ మల్లికార్జున్‌రావు, రూరల్ సీఐ సురేష్‌బాబు, పట్టణ ఎస్ఐలు పాల్గొన్నారు.



రేపల్లెలో 2కే రన్‌లో పాల్గొన్న డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు, పోలీసులు

● నగరం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : సర్దార్ వల్లభాయ్‌పటేల్ లాగా ప్రతి ఒక్కరూ ఉక్కుసంకల్పంతో ముందుకు వెళ్ళి జీవితంలో ఉన్నతస్థానానికి ఎదగాలని శ్రీవెలగపూడి రామకృష్ణ స్మారక కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అనగాని హరికృష్ణ అన్నారు. నగరంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో సర్దార్ వల్లభాయ్‌పటేల్ జయంతిని పురస్కరించుకుని కళాశాల నుంచి నగరం సెంటర్ సర్కిల్ వరకు శుక్రవారం యూనిట్ మార్చ్ నిర్వహించారు. అనంతరం ఎన్ఎస్ఎస్ వలంటీర్స్, విద్యార్థినీ, విద్యార్థులు నగరం సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎంవీ శివయ్య, సాంబమూర్తి, మస్తాన్, గోపీకృష్ణ, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆధార్ సెంటర్‌ను ప్రజలు ఉపయోగించుకోవాలి : ఎంపీడీవో

కర్లపాలెం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ కార్యాలయంలో ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు, దీనిని ముఖ్యంగా పదో తరగతి విద్యార్థులు ఉపయోగించుకోవాలని ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు తెలిపారు. కర్లపాలెం మండలంలోని యాజలి, గణపవరం, పాతనందాయపాలెం, సమ్మెటవారిపాలెంలో ఆధార్ సెంటర్‌లు ఉన్నాయని, సచివాలయ సిబ్బంది మారడటంతో ఒక్క సమ్మెటవారిపాలెం పంచాయతీలోని అధార్ సెంటర్ మాత్రమే లాగిన్ అవుతుందని, మిగతా సెంటర్‌లో పని చేయటం లేదన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్ ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు.

పదో తరగతి పరీక్ష కేంద్రం పరిశీలన

కర్లపాలెం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని యాజలి హైస్కూల్‌లో నిర్వహించనున్న పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని ప్రభుత్వ ఎగ్జామినేషన్స్ అసిస్టెంట్ కమిషనర్ కె.శివకుమార్ శుక్రవారం పరిశీలించారు. తరగతి గదులు, ప్రాంగణం పరీక్ష కేంద్రాలలో కల్పిస్తున్న సౌకర్యాలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుగుణమణి, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గూడవల్లిలో ఫోన్ అపహరణ

చెరుకుపల్లి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి) : మండలంలోని గూడవల్లిలో మొబైల్ స్నాచింగ్ జరిగింది. గూడవల్లికి చెందిన గరికపాటి భానుప్రకాష్ రోడ్డుపై వెళ్తుండగా బైక్‌పై వచ్చిన యువకుడు ఫోన్‌ని లాక్కుని ఉడాయించాడు. భానుప్రకాష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతామని ఎస్ఐ టి.అనిల్‌కుమార్ తెలిపారు.

కార్మికులు ఐక్యంగా ఉండాలి : కమిషనర్

రేపల్లె, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : కార్మికులు ఐక్యతతో కొనసాగుతూ తమ సమస్యలను పరిష్కరించుకుంటూ పట్టణాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలని కమిషనర్ కె.సాంబశివరావు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ముందు ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం జెండా ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పడమటి భిక్షాలు, ఏఐటీయూసీ కన్వీనర్ సింగం వాణిశ్రీ, కన్నెగంటి రమేష్, కోనాశ్రీనివాసరావు, ఎస్.శ్రీనివాసరావు, ఆవుల సాంబశివరావు, నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు.

● భట్టిప్రోలు (కొల్లూరు), అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : కార్మికుల హక్కులను, చట్టాలను కాలరాస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు సంఘటిత పోరాటాలకు సిద్ధం కావాలని ఏపీ చేనేత రాష్ట్ర సహాయ కార్యదర్శ గొట్టిముక్కల బాలాజీ, ఏఐటీయూసీ నాయకులు బండారు శ్రీనివాసరావులు పిలుపునిచ్చారు. శుక్రవారం ఎఐటియుసి 106వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని స్థానిక కార్యాలయంలో పతాకాన్ని ఎగుర వేశారు. భవన నిర్మాణ కార్మికులు కె.సత్యనారాయన, రాజుద్దీన్, చేనతే కార్మిక సంఘం నాయకులు కె.పార్థసారధి, ఎఐవైఎఫ్ నాయకులు వి.శ్రీనివాసరావు, ఓబులశెట్టి రమేష్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మాజీ మండల అధ్యక్షురాలు జయలక్ష్మి మృతి



జయలక్ష్మి (ఫైల్)

చుండూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : మాజీ మండల అధ్యక్షురాలు ఉయ్యూరు జయలక్ష్మి (75) శుక్రవారం చుండూరులోని స్వగృహంలో గుండెపోటుతో మృతి చెందారు. 2006-2011 మధ్య కాలంలో ఆమె మండల అధ్యక్షురాలుగా పని చేశారు. ఆమె మృతికి మండల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు సంతాపం వ్యక్తం చేశారు.



పెదలంక వద్ద ఎమ్మెల్యే ఆనందబాబుకు సమస్యలు వివరిస్తున్న మహిళలు

దెబ్బతిన్న పంటలన్నింటికి నష్టం అంచనాలు నమోదు

● వేమూరు ఎమ్మెల్యే ఆనందబాబు

కొల్లూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్‌కు దెబ్బతిన్న పంటలన్నింటికి నష్టం అంచనాలు నమోదు చేయిస్తామని, రైతులు అధైర్యపడాల్సిన పని లేదని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. శుక్రవారం కొల్లూరు మండల పరిధిలోని పెదలంక, చింతల్లంక, ఈపూరులంక, సుగ్గునలంక, చిలుమూరులంక, గాజుల్లంక తదితర గ్రామాల్లో పర్యటించి తుఫాన్‌కు దెబ్బతిన్న అరటి, మినుము, కూరగాయల పంటలను పరిశీలించారు. చింతల్లంక వద్ద పూర్తిగా పడిపోయిన కాకర పందిళ్లు, అరటి తోటలను ఎమ్మెల్యే పరిశీలించి రైతులను పరామర్శించారు. మినుము పంట నమోదు చేయడం లేదని వ్యవసాయాధికారులు చెబుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి రైతులు తీసుకు రాగా దెబ్బతిన్న మినుము పంటను పరిశీలించి నిబంధనల మేరకు నమోదు చేసి రైతులను ఆదుకోవాలని వ్యవసాయాధికారులకు సూచించామన్నారు. త్వరితగతిన పంటనష్టం అంచనాలు వేయించి పరిహారం అందేలా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. తుఫాన్ ప్రభావానికి గురైన వారందరికి నిత్యవసరాలు అందించాలని తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లుకు సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్ పర్సన్ గొట్టిపాటి పూర్ణకుమారి, మండల పార్టీ అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ, మాజీ ఎంపీపీ డాక్టర్ కనగాల మధుసూదనప్రసాద్, పార్టీ నాయకులు జివిఎల్‌జి భగవాన్, శిగిలిశెట్టి రాఘవరావు, తుమాటి శ్యాంబాబు, నూకల సాంబశివరావు, గొల్లపూడి వెంకటసుబ్బారావు, సుగ్గన నాగమల్లేశ్వరరావు, సనకా పాపారావు, ఉద్యాన శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్ విద్యార్థినికి ఆర్థిక సాయం

కొల్లూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : తండ్రి అనారోగ్యంతో చదువు ఆపివేసిన నర్సింగ్ విద్యార్థినికి టీడీపీ నాయకులు శుక్రవారం ఆర్థిక సాయం అందించారు. స్థానిక కెటి కాలనీకి చెందిన టీడీపీ కార్యకర్త తుపాకుల వెంకటేశ్వర్లు కుమార్తె రజిని తెనాలిలోని ఓ ప్రైవేట్ నర్సింగ్ కళాశాలలో చదువుకుంటుంది. తండ్రి అనారోగ్య సమస్యలతో బాధపడుతుండటంతో ఆమె చదువుకు ఆటంకం కలిగింది. విషయం తెలుసుకున్న టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ, తనతో పాటు ఆర్థిక సాయం అందించేందుకు ముందుకు వచ్చిన తుమాటి శ్యాంబాబు సంయుక్తంగా రూ.30 వేలు ఆర్థిక సాయం అందించగా, ఆ మొత్తాన్ని కొల్లూరులోని ఎంప్లాయిస్ రిక్రియేషన్ క్లబ్‌లో ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు చేతుల మీదుగా విద్యార్థినికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గొట్టిపాటి పూర్ణకుమారి, తెలుగు యువత బాపట్ల పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి కొల్లూరు నాగశ్రీధర్, గాదె చంటి, బుర్రి జగన్ పాల్గొన్నారు.

ప్రజల సమస్యల పరిష్కారం కోసమే వేదిక

● శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థాన ట్రస్టు బోర్డు సభ్యుడు నాగేశ్వరరావు

రేపల్లె, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సమస్యలను పరిష్కరించేందుకే ప్రజాఫిర్యాదుల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, నియోజకవర్గంలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థాన ట్రస్టు బోర్డు సభ్యుడు జీవీ నాగేశ్వరరావు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ప్రజాఫిర్యాదుల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజల సమస్యల పరిష్కారం కోసమే పనిచేస్తుందని, వారు ఇచ్చిన ఫిర్యాదులన్నీ పరిశీలించి ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. మొత్తం 50 ఫిర్యాదులు అందాయన్నారు. ఈ కార్యక్రమంలో బొర్రా సూర్యరాజు, టీడీపీ నాయకులు తాడిపర్తి మల్లికార్జున్‌రావు, వెనిగళ్ళ సుబ్రహ్మణ్యం, వాకా చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు అండగా ఉంటా : శివప్రసాద్



పునరావాస కేంద్రంలో భోజనాన్ని అందిస్తున్న ఆర్డీవో రామలక్ష్మి, శివప్రసాద్

రేపల్లె, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : కృష్ణానదికి వరద ప్రభావంతో ప్రజలకు ఎలాంటి నష్టం వాటిల్లదని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. మండలంలోని పెనుమూడి పల్లెపాలెం వాసులకు వరద రావటంతో పునరావాస కేంద్రాల్లో ఉన్న వారికి శుక్రవారం భోజనాన్ని అందించారు. ఆయన మాట్లాడుతూ కృష్ణానదికి వరద ఉధృతి ప్రస్తుతం 4 నుంచి 5 లక్షలు క్యూసెక్కుల నీరు విడుదలవుతుందని, దానివల్ల ప్రమాదం లేదన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రామలక్ష్మి, కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పంతాని మురళీధరరావు, తహసీల్దార్ మోర్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాల జాబితాలో అనర్హులు

● జాబితా పారదర్శకంగా లేదన్న ఆరోపణలు

అమృతలూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాను సందర్భంగా పునరావాస కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈకేంద్రాల్లో నిరుపేదలు, శిధిలావస్థలో గృహం ఉన్న వారికి ఇక్కడ ఆశ్రయం కల్పించారు. వీరికి వసతి, భోజన సౌకర్యం కల్పించడంతోపాటు ప్రభుత్వం సాయం అందిస్తుంది అని తెలిపింది. పునరావాస కేంద్రాల్లో ఉన్న వారి జాబితాను సిద్ధం చేసి పంపాలని ఉన్నతాధికారులు కోరడంతో క్షేత్ర స్థాయిలో రెవెన్యూ సిబ్బంది పునరావాస కేంద్రాల్లో ఉన్న వారి జాబితాను సిద్ధం చేస్తున్నారు. తుఫాను సమయంలో పునరావాస కేంద్రాల్లో లేని వారు కూడా తమ పేర్లు చేర్చాలని కోరుచున్నారు. స్థానిక నాయకులు సిఫార్సుల మేరకు మరికొన్ని పేర్లు కూడా నమోదు చేసేందుకు ఒత్తిడి తెస్తున్నట్లు ప్రజలు చెప్పుకుంటున్నారు. దీంతో ఈ జాబితా పారదర్శకంగా లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే బోడుపాడులో ఒక పూరిల్లు పూర్తిగా కూలిపోతే రెవెన్యూ సిబ్బంది గుర్తించడంలో విఫలం అయ్యారన్న విమర్శలు ఉన్నాయి.

నిబంధనల మేరకు పంట నష్టం అంచనాల సర్వే

● సహాయ సంచాలకురాలు లక్ష్మి

వేమూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ నిబంధనల మేరకు తుఫాన్ వల్ల నష్టపోయిన పంటల అంచనాల సర్వే నిర్వహించడం జరుగుతుందని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకురాలు లక్ష్మి తెలిపారు. శుక్రవారం ఆమె మండల పరిధి గ్రామాల్లో ప్రారంభమైన పంటల నష్టంపై సర్వేలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులో మాట్లాడుతూ, 33 శాతం కన్నా ఎక్కువగా పంట నష్టపోతేనే సర్వే జాబితాలోకి గుర్తించడం జరుగుతుందన్నారు. మండల వ్యవసాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో విఎఎలు పాల్గొంటారని తెలిపారు.

సురక్షిత గ్రామాలుగా తీర్చిదిద్దుకుందాం

చుండూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : మన నివాస గ్రామాలను సురక్షిత గ్రామాలుగా తీర్చిదిద్దుకుందామని ల్యాంప్ సంస్థ కో-ఆర్డినేటర్ కొండపల్లి వెంకటేశ్వరరావు అన్నారు. యడ్లపల్లి శ్రీఆలపాటి వెంకట్రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సురక్షిత గ్రామాలు గురించి శుక్రవారం అవగాహన కల్పించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి ఎంఎస్ వకులాదేవి వివరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం శ్రీనివాసరావు, ఎఎస్ఐ ధనుంజయ, కిషోర్, కోటయ్య తదితరులు విద్యార్థులకు అవగాహన కల్పించారు.

బీజేపీ మండల కన్వీనర్‌గా గౌతమ్ సాయిరాంశర్మ

చెరుకుపల్లి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి) : బీజేపీ మండల నూతన కన్వీనర్‌గా గుళ్ళపల్లికి చెందిన పెనుమర్తి గౌతమ్‌సాయిరాంశర్మను బీజేపీ జిల్లా అధ్యక్షుడు బంగారుబాబు నియమించారు. త్వరలోనే మండల పూర్తికమిటీవేసే విధంగా పార్టీ కోసం పనిచేస్తానని గౌతమ్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వెంకటరామకృష్ణ, రాంపల్లి జాగన్నాథశాస్త్రి జిల్లా అధికార ప్రతినిధి తోటకూర శ్రీనివాసరాజు, నాసిన మణికుమార్, దామర్లచంద్రబాబు పాల్గొన్నారు.

సస్యరక్షణతో ఉద్యాన పంటలకు ఊపిరి

తక్షణ చర్యలతో తెగుళ్ల నివారణ

నరసరావుపేట, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ నేపథ్యంలో వరద ముంపునకు గురైన ఉద్యాన పంటలను ఉద్యాన అధికారి ఐ.వెంకట్రావు, లాంఫాం కీటక శాస్త్రవేత్త డాక్టర్ బి.నాగేంద్రరెడ్డి శుక్రవారం పరిశీలించారు. మాచర్ల మండలంలోని కొత్తపల్లి, కొప్పునూరు గ్రామాల పరిధి సాగులో ఉన్న మిరప, పుచ్చసాగును పరిశీలించిన అనంతరం రైతులతో మాట్లాడారు. ఉద్యాన పంటల సస్యరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు.

మిరప పంటలో జాగ్రత్తలు

మొదటగా మిరప తోటలో నీరు నిలబడకుండా బయటకు వెళ్లే మార్గాలను చేసుకోవాలి.వాలిపోయిన మొక్కలను జాగ్రత్తగా నిలబెట్టి మొదలు చుట్టూ మట్టిని ఎగదోయాలి. మొక్కలు ఉరుకెత్తి తలలు వాల్చినట్లయితే వెంటనే తేరుకోవడానికి లీటర్ నీటికి 10 గ్రాముల యూరియా కలిపిన ద్రావణాన్ని వారంలో రెండుసార్లు పిచికారి చేయాలి. వడలిన మొక్కలకు లీటర్ నీటికి ఐదు గ్రాముల మెగ్నీషియం సల్ఫేట్ కల్పిన ద్రావణం పిచికారి చేయాలి. ఇనుప ధాతు లోపంతో మొక్కలు పాలి పోయినట్లు కనబడితే 10 లీటర్ల నీటికి 50 గ్రాముల అన్నభేదితో పాటు ఒక నిమ్మచెక్క రసం కలిపి పిచికారి చేయాలి. పైపాటుగా అద నంగా ఎకరానికి 50 కేజీల యూరియా 250 కేజీల వేపపిండి వేయాలి. నేల అదును వచ్చిన వెంటనే గొర్రు అంతర కృషి చేయాలి. మొక్కలు తేరుకున్న తర్వాత స్థూల పోషకాల మిశ్రమాన్ని ఐదు గ్రాములు లీటర్ నీటికి.. సూక్ష్మ పోషకాల మిశ్రమాన్ని 2.50 గ్రాములు లీటర్ నీటికి ఒక దాని తర్వాత ఒకటి వారం రోజుల వ్యవధిలో రెండు నుంచి మూడుసార్లు పిచికారి చేయాలి.

బ్యాక్టీరియా ఆకు మచ్చ, కొయినో ఫోర వంటి తెగుళ్లు ఆశించే అవకాశం ఉంది. కాబట్టి ముందు జాగ్రత్త చర్యగా 10 లీటర్ల నీటికి 30 గ్రాముల కాపర్ ఆక్సిక్లైడ్, గ్రాము స్ట్రెప్టోసైక్లీన్ కలిపిన ద్రావణం పిచికారి చేయాలి. మిరప పంట ముంపునకు గురై పూర్తిగా పంటకు నష్టం వాటిల్లినప్పుడు పంటను తీసివేసి ప్రత్యామ్నాయంగా వేరొకపంటను సాగు చేసుకోవాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

పొలంలో నిలిచిన నీటిని సాధ్యమైనంత త్వరగా బయటకు పంపాలి. బోదెలపై లేదా బెడ్లపై నాటుకోవాలి. వర్షాలు ఆగిన వెంటనే 19:19:19 లేదా 13:0:45 లేదా యూరియా వం టి పోషకాలను పంటకు అందించాలి. అవస రాన్ని బట్టి సూక్ష్మ పోషకాలను కూడా పిచికారి చేసుకోవాలి. నేల కొంచెం ఆరిన తర్వాత రసా యనిక ఎరువులను వేసుకోవాలి. అధిక వర్షాల ను విత్తనం మొలకెత్తినప్పుడు లేదా లేత మొ క్కలు దెబ్బతిన్నప్పుడు నర్సరీలో నారు పెంచుకొని సమయాన్ని ఆదా చేసుకోవచ్చు. వర్షాలు ఆగిన వెంటనే అంతర సేద్యం చేసే కలుపును తొలగించడమే కాకుండా నేల త్వరగా ఆరేట్లు చేసుకోవాలి.మొక్కలకు ఊతం ఇవ్వడం, పందిళ్లపై తీగజాతి కూరగాయలను సాగు చేసుకోవడం వంటివి చేయాలి.

సస్య రక్షణ చర్యలు

ఆకు తినే పొగాకు లద్దె పురుగు నివారణకు విషపు ఎరలను ఉపయోగించాలి. (అన్ని కూరగాయ పంటలు) అక్షంతల పురుగు, చిత్త పురుగుల నివారణకు వర్షాలు ఆగిన వెంటనే క్లోరిపైరిఫాస్ 2మి.లీ./లీ లేదా థయోడి కార్బ్ 1గ్రా/లీ పిచికారి చేసుకోవాలి. ఎండు తెగులు నివారణకు కాపర్ ఆక్సి క్లోరైడ్ 3గ్రా/లీ లేదా మోటాలాక్సిల్+మంకోజెబ్ ట 2గ్రా/లీ మొక్కల మొదళ్లలో పోయాలి (మిరప, టమాట, క్యాబేజీ) ఆకుపచ్చ తెగుళ్ల నివారణకు కార్బండిజం 1గ్రా/లీ లేదా మంకోజెబ్ 2.5 గ్రా/లీను పిచికారి చేసుకోవాలి(మిరప, టమాటా, చిక్కుడు, ఆకుకూరలు) బూజు తెగులు నివారణకు డైమి థోమర్ఫ్ ట 1.5 గ్రా/లీ లేదా మెటాలాక్సిల్ + మంకోజెబ్ ట 2.0గ్రా/లీను పిచికారీ చేసు కోవాలి (బీర, కాకర, దోస, పొట్ల, సొర) బ్యాక్టీరి యా మచ్చ తెగులు నివారణకు కాపర్ ఆక్సీక్లో రైడ్ 3 గ్రా/లీ ప్లాంటా మైసిస్ 2 గ్రా/లీ కలిపి పిసికారి చేసుకోవాలి(టమాటా, వంగా, క్యాప్సికం).

మురుగు నీటిని బయటికి పంపాలి మొక్కలు నీటిలో నాలుగు రోజులకంటే ఎక్కువ ఉన్నట్లయితే వయసుతో సంబంధం లేకుండా వేరే పంటలను వేసుకోవాలి మూడుసార్లు యూరియా లేదా పొటాషియం నైట్రేట్ ద్రావ ణాన్ని వారం వ్యవధిలో పిచికారి చేయాలి ప్రా పికొనజాల్,డైఫెన్కోనాజల్ద్రావణాలను రెండుసార్లు వారం వ్యవధిలో పంటపైన పిచికారి చే సినట్లయితే ఆకుమచ్చ, తాటాకు మచ్చ తెగులను నివారించవచ్చు. సూక్ష్మ పోషకాలు మిశ్ర మాన్ని 5 గ్రాములు లీటర్ నీటికి కలిపి 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేసినట్లయితే మొక్కలు త్వరగా కోలుకుంటాయి.


ముంపునరు గురైన మిరప చేనును పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ జిల్లా అధికారి వెంకట్రావు, కీటక శాస్త్రవేత్త బీ నాగేంద్రరెడ్డి

ఉప్పొంగిన సంద్రం


లంకేవానిదిబ్బలో సముద్రం ఉప్పొంగటంతో నీటమునిగిన 320 ఎకరాల వరి పొలాలు

నీట మునిగిన వరి పొలాలు
ఆక్వా సాగుకు తీవ్ర నష్టం
దెబ్బతిన్న బోట్ల మరమ్మతుల్లో మత్స్యకారులు

రేపల్లె, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): తీర ప్రాంతంలోని సముంద్రం ఒడ్డున ఉన్న లంకేవానిదిబ్బలో చేతికొచ్చే వరి పంట, రొయ్యలచెరువులు ఉప్పెన దాటికి నీట మునిగాయి. ఆరుగాలం కష్టపడి పండించిన పంటం తా నీటి పాలైందంటూ రైతులు బోరున విలపిస్తున్నారు. గతేడాది తుఫాన్ కారణంగా వందలాది ఎకరాల వరి,పంట రొయ్యల చెరువులు నీట మునిగి లక్షలాది రూపాయలు నష్టపోయామని గుర్తుచేసుకుంటున్నారు. గ్రామంలో మొంథా తుఫాన్ కారణంగా కృష్ణానది సముద్రం కలిసే భూభాగం సమీపంలో ఉన్న వరి పొలాలు 320ఎకరాలు, 200ఎకరాల రొయ్యల చెరువులు నీటమునిగాయి. ఉప్పునీటిలో నానటంతో పొట్ట దశలోని వరి పంట చౌడువేసుకుపోయి మాడిపోయింది. ఇప్పటికే ఎకరాకి రూ.30వేలు పెట్టుబడి పెట్టామని సాగుదారులు అంటున్నారు.

జెట్టీలో పడవలు నీట మునక

లంకేవానిదిబ్బ గ్రామంలో సుమారు 15 వందల మత్స్యకారుల కుటుంబాలు చేపల వేటపై జీవనం సాగిస్తున్నాయి. తుఫాను ధాటికి కొన్నింటికి బోట్ల ఇంజన్లు, కొన్నింటిలో కింద భాగం పూర్తిగా దెబ్బంతిందని మత్స్యకా రులు చెబుతున్నారు. లంకేవానిదిబ్బ జెట్టీలో 200కు పైగా మరబోట్లు ఉన్నాయని 100 బోట్లు పాక్షికంగా దెబ్బతిన్నాయని వెల్లడించారు. దెబ్బతిన్న బోట్లు, వలలు బాగుచేసుకోవాలంటే రూ.50వేలు పైనే ఖర్చు అవుతుందని అంటున్నారు. రెక్కాడితే డొక్కాడని తమకు వేట లేకపోవటంతో నానా ఇబ్బందులు పడుతున్నామన్నారు. ప్రభుత్వం మత్స్యకారులను ఆదుకోవాలని కోరుతున్నారు.


దెబ్బతిన్న బోటుకు మరమ్మతులు చేసుకుంటున్న మత్స్యకారులు

320 ఎకరాల పంట నష్టం
- రైతు విశ్వనాథపల్లినాగరాజు

ఉప్పు నీటిలో 320 ఎకరాలుపైనే వరి పొలాలు నానుతున్నాయి. ఎకరాకి రూ.25 వేల నుంచి రూ.30 వేలు వరకు పెట్టుబడి పెట్టాం. రొయ్యల చెరువులపైనా..ఎకరాకు రూ.3 లక్షలు పైనే పెట్టుబడి పెట్టాం. నెలరోజుల్లో చేతికొచ్చే పంట సముద్రం పాలైంది.


సముద్రం ఉప్పొంగటంతో గండ్లుపడిన రొయ్యల చెరువులు



శేషగిరమ్మ బాధ్యత ప్రభుత్వానిదే..

● ఆమె మనమరాలు శ్యామలకు పునరావాసం కల్పించాలి ● ఎస్‌జీపీకి హైకోర్టు ఆదేశం.. విచారణ వాయిదా

అమరావతి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): తుళ్లూరు మండలం రాయపూడి గ్రామానికి చెందిన నెల్లూరి శేషగిరమ్మ, ఆమె మనువరాలు శ్యామలకు పునరావాసం కల్పించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని హైకోర్టు స్పష్టం చేసింది. శేషగిరమ్మ మనువరాలు శ్యామల మానసిక వైకల్యంతో బాధపడుతున్నందున జీవించి ఉన్నంతకాలం ఆమె బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వమే తీసుకోవాలని పేర్కొంది. శేషగిరమ్మ కుటుంబ సభ్యుల నుంచి సీఆర్‌డీఏ తీసుకున్న భూమిలో ఉన్న బోర్ల ద్వారా ఆ కుటుంబం ఆదాయం పొందతోఓందని గుర్తు చేసింది. భూమికి బదులు మరోచోట భూమి ఇస్తే సరిపోదని, వారికి ఆదాయాన్ని చూపించాల్సిన బాధ్యత కూడా అధికారులపై ఉందని తేల్చి చెప్పింది. ఈ అంశాలపై వివరాలు తెప్పించుకొని కోర్టు ముందు ఉంచాలని ఎస్‌జీపీని ఆదేశించింది. విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. మరో వైపు వ్యాజ్యంలోని అభ్యర్థనలపై న్యాయమూర్తి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికారుల చర్యతో అన్యాయం జరిగిందని భావిస్తే అభ్యర్థనలను అంతవరకే పరిమితం చేసి ఉండాల్సిందని వ్యాఖ్యానించారు. పిటిషన్‌లో ఇలాంటి అభ్యర్థనలను గతంలో ఎన్నడూ చూడలేదని, ఈ విషయంలో తాము ఎంత మాత్రం సంతోషంగా లేమన్నారు.

రాయపూడిలోని 5సెంట్ల ఇంటి స్థలాన్ని నిరక్షరాస్యత కారణంగా పొరపాటున ల్యాండ్ పూలింగ్ స్కీమ్ కింద సీఆర్‌డీఏకు అప్పగించామని, దానిని తిరిగి తమకు అప్పగించేలా సీఆర్‌డీఏ అధికారులను ఆదేశించాలని కోరుతూ గ్రామానికి చెందిన 90ఏళ్ల వృద్ధురాలు నెల్లూరి శేషగిరమ్మ, చెరుకూరి వెంకాయమ్మ, మనవరాలు చెరుకూరి శ్యామల హైకోర్టును ఆశ్రయించారు. నివాసం ఉండేందుకు ఆ స్థలం మినహా మరొకటి లేదని, తిరిగి ఇవ్వడం వీలుకాకుంటే కారుణ్య మరణానికి అనుమతించాలని కోరారు. ఈ వ్యాజ్యం శుక్రవారం విచారణకు రాగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) ఎస్.ప్రణతి వాదనలు వినిపించారు. శేషగిరమ్మ కుమార్తె చెరుకూరి వెంకాయమ్మకు 1.43 ఎకరాల భూమి ఉందన్నారు. భూమిని ల్యాండ్ పూలింగ్‌కు ఇచ్చేందుకు సమ్మతి తెలిపారన్నారు. తదనంతరం ఆ భూమిలో 1.38 ఎకరాలను మరొకరికి విక్రయించగా, కొనుగోలు చేసిన వ్యక్తి సీఆర్‌డీఏ రిటర్నబుల్ ప్లాట్‌ను కేటాయించిందన్నారు. మిగిలిన 0.5 సెంట్లను రిజిస్టర్ సేల్ డీడ్ ద్వారా తండ్రి శేషగిరిరావుకు రిజిస్టర్ చేశారన్నారు. ఆ 5 సెంట్లను శేషగిరిరావు ల్యాండ్ పూలింగ్ స్కీమ్ కింద సీఆర్‌డీఏకి అప్పగించారన్నారు. ఆ భూమిలో బోర్లు వేసి దొండపాడు పంచాయితీ వాడుకొంటుందన్నారు. అందుకుగాను శేషగిరిరావుకు ఉద్యోగం కల్పించారన్నారు. శేషగిరిరావు చనిపోయిన తరువాత అతని బంధువుకు ఉద్యోగం ఇచ్చారన్నారు. ప్రస్తుతం శేషగిరమ్మ, మనవరాలు శ్యామల బాధ్యతను అతనే చూసుకుంటున్నాడని వివరించారు. సీఆర్‌డీఏ నిబంధనల ప్రకారం 5సెంట్ల భూమికి టీడీఆర్ బాండ్లు ఇచ్చే వెసులుబాటు మాత్రమే ఉందన్నారు. అయినప్పటికీ శేషగిరమ్మ కుటుంబ సభ్యులు ఇచ్చిన సెంట్ల భూమికి బదులు మరో చోట భూమి ఇచ్చేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారని వివరించారు. మానసిక వైకల్యంతో బాధపడుతున్న శ్యామలకు పెన్షన్ ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. పిటిషనర్ల తరఫు న్యాయవాది బాలయ్య వాదనలు వినిపిస్తూ... శ్యామల 90శాతం మానసిక వైకల్యంతో బాధపడుతున్నట్లు అధికారులు నిర్ధారించారన్నారు. పిటిషనర్లలో ఒకరైన శేషగిరమ్మ కుమార్తె వెంకాయమ్మ పిటిషన్ వేసిన అనంతరం మరణించారన్నారు. వ్యాజ్యంలో ఆమె పేరును తొలగించాలని కోరారు.

వేధింపుల కేసులో జైలు, జరిమానా

గుంటూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మైనర్ బాలికను ప్రేమ పేరుతో లైంగిక వేధింపులకు పాల్పడిన యువకుడికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ. పోక్సో కోర్టు న్యాయాధికారి సుల్తానా బేగం శుక్రవారం తీర్పు చెప్పారు. నిందితుడు నేనావత్ గణేష్ నాయక్‌కు మూడేళ్ల జైలు, రూ. 10వేల జరిమాన, అతనికి సహ కరించిన అన్న నేనావత్ గోవింద్ నాయక్‌కు రూ. 5 వేల జరిమాన విధించారు. చాకలిగుంట, సుగాలి కాలనీకి చెందిన ఓ మైనర్‌ను గణేష్ నాయక్ ప్రేమిస్తున్నానని పెళ్లి చేసుకుంటానని పదేపదే వెంటపడి.. ఒప్పుకోకపోవడంతో బెదిరింపులకు పాల్పడ్డాడు. అతని అన్న గోవింద్ నాయక్ కూడా ఇందుకు సహకరించాడు. దీంతో వారిపై 2021లో బాలిక తల్లిదండ్రుల లాలాపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో..కేసు నమోదు చేశారు. ఈ కేసు ట్రయల్స్ సమయములో సాక్షులను నిందితులు బెదిరించడంతో.. ప్రస్తుత సీఐ శివ ప్రసాద్ నిందితులపై మరొక కేసు నమోదు చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున సీనియర్ ఏపీపీ దుర్గ ప్రసాద్ వాదనలు వినిపించారు. హెడ్ కానిస్టేబుల్ ప్రకాష్, హోం గార్డ్ శాంతికుమారి, కోర్ట్ కానిస్టేబుల్ కె.సురేష్ బాబు నిందితులకు శిక్ష పడుటలో కృషి చేసిన వారందరినీ ఎస్పీ అభినందించారు.

పాముకాటుకు వ్యవసాయ కూలీ మృతి

తాడికొండ, అక్టోబరు31(ఆంధ్రజ్యోతి): పొలం పనిలో ఉన్న వ్యవసాయ కూలీ పాముకాటు వేయడంతో మృతి చెందిన ఘటన శుక్రవారం జరిగింది. పోలీసులు వివరాల మేరకు.. బండారుపల్లికి చెందిన వ్యవసాయ కూలీ మర్రిపూడి రమేష్. పత్తి చేనులో పనికి వెళ్లాడు. అక్కడ అతనిని పాము కాటు చేయడంతో.. తోటి కూలీలు గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. వైద్యులు రమేష్ మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతునికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుని భార్య రమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ జోజిబాబు తెలిపారు.

ఉబికి వస్తున్న కన్నీరు!

(5వ పేజీ తరువాయి)

చేనేత పరిశ్రమ తీవ్రంగా దెబ్బతింది. నాలుగు నెలలుగా కురుస్తున్న వర్షాలకు నేతన్నలు పనులు కోల్పోగా, కిందటి నెల కురిసిన ఎడతెరపి లేని వర్షాలు వారిని పీకల్లోతు కష్టాల్లో ముంచేశాయి. ఈ వర్షాల కారణంగా గుంటూరు జిల్లాలోని మంగళగిరి, పేటేరు, ఇసుకపల్లి, రాజోలు, చెరుకుపల్లి, కనగాల, పొన్నూరు, చిలకలూరిపేట, తెనాలి, బాపట్ల జిల్లాలోని ఈపూరుపాలెం, చీరాల, వేటపాలెం, పందిళ్లపల్లి, ఈతముక్కల, వలపర్ల తదితర ప్రాంతాల్లో 25 వేల కుటుంబాలు బాగా దెబ్బతిన్నాయి. చీరాల పరిసర గ్రామాల్లోనే 17 వేల కుటుంబాలు ప్రత్యక్షంగా తుపాను బారిన పడగా.. మంగళగిరిలో 3 వేల కుటుంబాలు, రేపల్లె పరిసర ప్రాంతాల్లో మరో 3 వేల కుటుంబాలు తుపాను ప్రభావానికి గురయ్యాయి. చేతిలో పని ఉన్నా- అనుకూలమైన వాతావరణం లేకపోవడంతో నేతన్నలు తీవ్రంగా నష్టపోయారు.

ఊటెక్కుతున్న మగ్గం గుంతలు

మొంథా తుపాను ప్రభావం చీరాల పరిసర ప్రాంతాల్లో అత్యంత తీవ్రంగా ఉంది. చీరాల చుట్టుపక్కల ప్రాంతాల్లో మూడు రోజుల పాటు ఎడతెరపి లేకుండా కురిసిన గాలివాన కారణంగా భూగర్భ జలాల నీటిమట్టం విపరీతంగా పెరిగింది. మగ్గాల గుంతల్లోకి నీరు ఊరింది. మగ్గం గుంతల్లో రెండడుగుల మేర చేరిన ఈ నీటిని తోడుకున్నా ఊట వస్తూనే ఉంది. ఈ కారణంగా నీరు పూర్తిగా ఇంకిపోయే వరకూ నేతన్నలకు మగ్గం గుంతలో అడుగుపెట్టే అవకాశం ఉండదు. ఈ నీరు ఇంకడానికి కనీసం రెండు నెలల సమయమైనా పడుతుంది. ఈలోగా మళ్లీ వర్షాలు కురిస్తే పరిస్థితి మరింత దిగజారుతుంది. ఈలోపు మగ్గంపై ఉన్న పడుగు, పేకలు దెబ్బతిని పోతాయి. ఇలా అన్ని విధాలుగా చేనేత కార్మికులు నష్టపోయే అవకాశం ఉంది.

వీడని ముంపు

(5వ పేజీ తరువాయి)

కార్డులు లేకుండా సాగు చేసుకుంటున్న కౌలు రైతుల పరిస్థితే ఏమిటో ఎవరికీ తెలియడంలేదు. ఒక్క బాపట్ల జిల్లా వరకు చూస్తే ఖరీఫ్ ప్రారంభంలో 3,26,000 ఎకరాల సాగు సాధారణ విస్తీర్ణంగా వ్యవసాయశాఖ అంచనా వేసింది. ఈ-క్రాప్‌లో నమోదు చేసింది 2,84,000 ఎకరాలు మాత్రమే. ఇందులో దాదాపు 50,000 ఎకరాల వరకు సాగు చేసుకుంటున్న కౌలుదారు కాకుండా భూ యజ మాని పేరిటే ఈ-క్రాప్‌లో నమోదైంది. రెండు లక్షల మంది వరకు కౌలురైతులు ఉంటే 80,000 మందికి మాత్రమే సీసీఆర్‌సీ కార్డుల పంపిణీ జరిగింది. ఇదే పరిస్థితి పల్నాడు, గుంటూరు జిల్లాల్లోనూ ఉంది. అంటే అటు ఈ-క్రాప్ నమోదు కాని సాగుదారులు, ఇటు కౌలు రైతులు మొంథా పరిహారానికి అర్హులు కాకుండా పోతున్నారు. సాధారణ విస్తీర్ణానికి, ఈ-క్రాప్ నమోదు లెక్కలకు పొంతన లేకపోవడం కూడా పరిహారానికి అడ్డంకులుగా మారనున్నాయి. ఆంధ్రప్రదేశ్ అగ్రికల్చరల్ ఇన్‌ఫర్మేషన్ మేనేజ్ మెంట్ సిస్టమ్ (ఏపీఎయిమ్స్) యాప్ ద్వారా మాత్రమే పంట నష్టాన్ని అంచనా వేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. అయితే ఈ-క్రాప్‌లో లేకుండా పంట నష్టపోయిన వివరాలను విడిగా నమోదు చేస్తామని యంత్రాంగం చెబుతున్నప్పటికీ దానిపై స్పష్టత లేదు. మూడు రోజుల్లోనే ఏపీఎయిమ్స్‌లో పంట నష్టం వివరాలన్నీ నమోదు చేయాలనే ఆదేశాలు యంత్రాంగానికి అందాయి. ఇంత స్వల్ప వ్యవధిలో ఇది సాధ్యం కాకపోగా అర్హులైన ఎంతో మంది రైతులకు అన్యాయం జరిగే అవకాశం ఉంది. సాంకేతిక చిక్కులపై సడలింపులు ఇవ్వడంతో పాటు, ఏపీ ఎయిమ్స్ యాప్ నమోదే ప్రామాణికంగా కాకుండా మ్యానువల్ నమోదుకు కూడా ఆస్కారమిస్తేనే రైతులు గట్టెక్కే అవకాశం ఉంది.

ఉదారంగా వ్యవహరించాలి

క్షేత్రస్థాయిలో ఈ-క్రాప్ నమోదుకు, ప్రస్తుతం జరిగిన నష్టానికి పొంతన లేదు. ముఖ్యంగా ఏపీఎయిమ్స్ యాప్ విషయంలో నిబంధనలు సడలించకపోతే రైతులకు పరిహారం ఎండమావే. గతంలో బర్లీ పొగాకును మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసే విషయంలో కూడా ఎయిమ్స్ యాప్‌లో నమోదైన వివరాలకు, ఈ-క్రాప్ లెక్కలకు పొంతన లేకపోవడంతో నిబంధనల విషయంలో ఉదారంగా వ్యవహరించారు. అదేవిధంగా ఇప్పుడు కూడా ఈ-క్రాప్‌లో నమోదు చేసుకోని వారిని కూడా పరిహారానికి అర్హులయ్యే విధంగా చూడాలని రైతులు కోరుతున్నారు.


ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఆర్‌ఎం సుధేష్ణ సేన్

రైల్వేలో ఘనంగా రాష్ట్రీయ ఏకతా దివస్

గుంటూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా రైల్వేలో ఘనంగా రాష్ట్రీయ ఏకతా దివస్‌ని నిర్వహించారు. శుక్రవారం ఉదయం పట్టాభిపురంలోని రైల్‌వికాస్ భవన్‌లో డీఆర్‌ఎం సుధేష్ణ సేన్ రైల్వే అధికారులు, ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఐక్యత స్ఫూర్తిని పెంపొందిస్తూ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఎం మాట్లాడుతూ దేశ ఐక్యత, సమగ్రత, భద్రతపై రైల్వే సిబ్బంది అంకితభావాన్ని కలిగి ఉండాలన్నారు. ఏడీఆర్‌ఎం రమేష్‌కుమార్, సీనియర్ అధికారులు షాబాజ్ హనూర్, వినయ్‌కాంత్, శైలేష్‌కుమార్ పాల్గొన్నారు.

29 వంట గ్యాస్ సిలిండర్లు సీజ్

గుంటూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రాంతీయ కార్యాలయం అధికారులు దాడులు నిర్వహించి వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న 29 వంట గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకొన్నారు. శుక్రవారం సాయంత్రం దాసరిపాలెంలో వడ్డే వెంకట రమణారెడ్డికి చెందిన విజయశ్రీ బిల్డింగ్ మెటీరియల్ వాణిజ్య సముదాయంలో గుంటూరు జిల్లా విజిలెన్స్, సివిల్ సప్లయిస్, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. గృహ అవసరాల నిమిత్తం వినియోగించాల్సిన సిలిండర్ల గ్యాస్‌ను చిన్న చిన్న సిలిండర్స్‌లోకి రీఫిల్లింగ్ చేస్తున్నట్లు గుర్తించారు. షాపుల నిల్వ ఉన్న 29 సిలిండర్లు, ఒక మోటార్ స్వాధీనం చేసుకున్నారు. సివిల్ సప్లయిస్ డీటీ వెంకట్రావుకి అప్పగించి కేసు నమోదు చేయడానికి ఆదేశించారు. సీఐ కె.చంద్ర శేఖర్, ఎంఆర్వో లక్ష్మీమాధవి తదితరులు పాల్గొన్నారు.


దాడులలో స్వాధీనం చేసుకున్న సిలిండర్లు

48 గంటల్లోగా ధాన్యం సొమ్ము జమ

డీసీఎంఎస్ చైర్మన్ హరిబాబు నాయుడు

బాపట్ల, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): రైతు సేవా కేంద్రాలతో మధ్యవర్తుల మోసాలకు తావులే దని జిల్లా కో ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) చైర్మన్ వడ్రాణం హరిబాబునా యుడు తెలిపారు. బాపట్లలోని కార్యాలయంలో ధాన్యం కొనుగోలుపై సిబ్బందికి శిక్షణ తరగతులను గురువారం చైర్మన్ ప్రారంభించి, ప్రసంగించారు. రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం సమగ్ర చర్యలు తీసుకుంటుందన్నారు. రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు పూర్తిగా పారదర్శకంగా జరుగుతుందన్నారు. మధ్యవర్తులు లేకుండా ప్రతి రైతుకు కనీస మద్దతు ధర (ఎమ్ఎస్‌పీ) హామీగా లభిస్తుందని తెలిపారు. నాణ్యతా ప్రమాణాలకు లోబడి ఉన్న ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేస్తారని, రైతులు తమ పంటను సరైన విధంగా సిద్ధం చేసుకోవాలని సూచించారు. ధాన్యం విక్రయించిన 48 గంటల్లో రైతుల బ్యాంక్ ఖాతాల్లోకి నేరుగా సొమ్ము జమ అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో గ్లోరియా, నాగమల్లేశ్వరి, జమీర్ బాషా, బిజినెస్ మేనేజర్ హరి గోపాలం, డీసీఎంఎస్, ఆర్ఎస్కే సిబ్బంది ఉన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న డీసీఎంఎస్ చైర్మన్ హరిబాబునాయుడు తదితరులు

7న ఆచార్య ఎన్జీరంగా 125వ జయంతి

● ఉత్సవాలకు ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి

పొన్నూరు, అక్టోబరు31(ఆంధ్రజ్యోతి): రైతు ఉద్యమ నేత ఆచార్య ఎన్జీరంగా 125వ జయంతిని ఈ నెల 7న లాం ఫాంలో నిర్వహిస్తున్నట్లు ఆచార్య ఎన్జీరంగా జయంతుత్సవ కమిటీ నిర్వాహకులు రామినేని కిషోర్ బాబు తెలిపారు. నిడుబ్రోలు ఆచార్య ఎన్జీరంగా స్వగృహం గో భూమిలో శుక్రవారం విలేకర్ల సమావేశంలో నిర్వాహకులు మాట్లాడుతూ.. ఎన్జీరంగా యూనివర్సిటీలో ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ ఉత్సవాలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, పలువురు రాష్ట్ర మంత్రులు ఎంపీలు, ఎమ్మెల్యేలు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నట్లు చెప్పారు. ఉదయం 10 గంటలకు ఆచార్య ఎన్జీరంగా జీవిత చరిత్ర ఫొటో ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్లు చెప్పారు. అనంతరం అధునాతన వ్యవసాయ యంత్ర పరికరాల ప్రదర్శన, నూతన వండగాల వివరాలు, శాస్త్రవేత్తలు, రైతు నాయకులుతో చర్చలు జరగనున్నట్లు తెలిపారు. ఆచార్య ఎన్జీరంగా అభిమానులు, రైతులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. జయంతుత్సవ కమిటీ సభ్యులు డాక్టర్ సజ్జా హేమలత, బొద్దులూరి రంగారావు, ఆకుల జానకి బాబు, షేక్ యాసిన్ బాబా, గురుబాబు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జయంతోత్సవ కమిటీ నిర్వాహకులు

అవీ..ఇవీ..

నీవెంటే నేను..!

● భర్త మరణించిన గంటలోనే భార్య మృతి


పగడాల సుబ్బారావు, వెంకటసుబ్బులు (ఫైల్)

కారంచేడు (పర్చూరు), అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : భర్త మృతి చెందిన గంటలోనే భార్య కూడా తనువు చాలించింది. ఈ ఘటన కారంచేడు మండలం ఆదిపూడిలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఆదిపూడి గ్రామానికి చెందిన పగడాల సుబ్బారావు (80) అనారోగ్యంతో బాధపడుతుండటంతో శుక్రవారం ఉదయం చీరాల వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమించడంతో గుంటూరు వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఇక అనారోగ్యంతో బాధపడుతూ ఇంటి వద్దనే ఉన్న భార్య పగడాల వెంకటసుబ్బులు (70) భర్త మృతదేహాన్ని చూసి తట్టుకోలేకపోయింది. ఆయన భౌతిక కాయాన్ని ఇంటికి తెచ్చిన గంటలోనే ఆమె కూడా తుదిశ్వాస విడిచారు. ఇద్దరి మృతదేహాలకు బంధువులు ఒకేసారి దహన సంస్కారాలు నిర్వహించారు. ఈ ఘటన గ్రామస్థులను కలిచివేసింది.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

● బాపట్ల జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రావు


అధికారులకు సూచనలు ఇస్తున్న డీపీవో ప్రభాకర్‌రావు

పర్చూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయితీల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలని జిల్లా పంచాయితీ అధికారి ప్రభాకరరావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన పర్చూరు పంచాయతీ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పంచాయితీ జిల్లా అధికారి మాట్లాడుతూ తుపాను ప్రభావంతో ముంపునకు గురైన ప్రాంతాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టాలన్నారు. మురుగు నీరు నిల్వలేకుండా చేసి బ్లీచింగ్‌ను చల్లాలన్నారు. మండలంలో పారిశుధ్య కార్యక్రమాలపై అలసత్వం వహిస్తే సహించేది లేదన్నారు. అనంతరం పర్చూరు వాగు, వంతెన వద్ద వాగుచప్టావద్ద ముంపుకు గురైన ప్రాంతాలను ఆయన స్థానిక అధికారులతో కలసి పరిశీలించారు. పంచాయతీ సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో బి.హరిప్రసాద్, పంచాయతీ కార్యదర్శి మస్తాన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర క్రికెట్ జట్టుకు రావినూతల విద్యార్థి ఎంపిక


ప్రతిభ చూపిన విద్యార్థి విజయ్, పీఈటీ కల్యాణి

మేదరమెట్ల, అక్టోబరు31 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన క్రికెట్ పోటీల్లో రావినూతల విద్యార్థి ప్రతిభ చూపి రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యాడు. శుక్రవారం మండలంలోని పమిడిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన అండర్-14 రాష్ట్ర క్రికెట్ జట్టు ఎంపికలో రావినూతల హైస్కూల్ విద్యార్థి కే. విజయ్ ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయుడు రాఘవరెడ్డి తెలిపారు. రాష్ట్ర జట్టుకు ఎంపికైన విద్యార్థిని, శిక్షణ ఇచ్చిన పీఈటీ కల్యాణిని ఉపాధ్యాయులు, గ్రామస్థులు, హెచ్ఎం అభినందించారు.

గల్లంతైన వృద్ధుడి కోసం గాలింపు


నది వెంబడి గాలిస్తున్న పోలీసులు

అద్దంకి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): గుండ్లకమ్మ నదిలో దూకి గల్లంతైన వృద్ధుడు కోసం శుక్రవారం ఎస్‌డీఆర్ఎఫ్, పోలీస్ బృందాలు గాలించాయి. అద్దంకి పట్టణం సమీపంలోని గుండ్లకమ్మ బ్రిడ్జి వద్ద నుండి దిగువ కు సుమారు 3 కి.మీ దూరం అద్దంకి టౌన్, రూరల్ సీఐలు సుబ్బరాజు, మల్లిఖార్జునరావుల ఆధ్వర్యంలో సిబ్బంది డ్రోన్‌ల ద్వారా పరిశీలించారు. యస్‌డీఆర్ఎఫ్ బృందం, అగ్నిమాపక శాఖ అధికారి వెంకటరావుల ఆధ్వర్యంలో గుండ్లకమ్మ నదిలో గాలించారు. శనివారం కూడా గాలింపు చర్యలు చేపట్టనున్నట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు.

కారు ఢీకొని మోటార్ సైకిలిస్టుకు గాయాలు

అద్దంకి, అక్టోబరు31(ఆంధ్రజ్యోతి): కారు ఢీకొని మోటారు సైకిలిస్టుకు గాయాలైన ఘటన మండలంలోని శ్రీనివాసనగర్ వద్ద నామ్ రోడ్డులో మోటార్‌సైకిల్‌పై వెళ్తున్న నూతి వెంకటస్వామిని కారు ఢీ కొట్టడంతో గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు శ్రీనివాసనగర్ కు చెందిన నూతి వెంకటస్వామి శుక్రవారం మోటార్‌సైకిల్ పై పశువుల మేతకు వెళ్తుండగా నామ్ రోడ్డు లో వస్తున్న కారు ఢీ కొట్టింది. గాయపడ్డ వెంకటస్వామిని 108 వాహనం లో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

నేడు మంత్రి రవికుమార్ పర్యటన

అద్దంకి, అక్టోబరు31 (ఆంధ్రజ్యోతి):విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ శనివారం పలు కార్యక్రమాలలో పాల్గొననున్నారు. ఉదయం 9:30 గంటలకు పేదల సేవలో కార్యక్రమంలో భాగంగా అద్దంకి మండలంలోని చక్రాయపాలెంలో పించన్ల పంపిణీలో పాల్గొంటారు. 10:00 గంటలకు చ క్రాయపాలెం హైస్కూల్‌లో విద్యార్థులకు సైకిళ్ళు పంపిణీ చేస్తారు. 11 గంటలకు కుంకుపాడు, మోదేపల్లి, కొటికలపూడి లలో తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న పంటలు, రోడ్డు, వంతెనలను పరిశీలిస్తారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అద్దంకి,అక్టోబరు31(ఆంధ్రజ్యోతి): కొత్త టవర్ విద్యుత్ లైన్ పనుల నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈఈ దామోదరం తెలిపారు. అద్దంకి పట్టణంలోని కొత్తదామావారిపాలెం, భవానిసెంటర్ లలో 8 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు, ద్వారకానగర్, ఆటోనగర్, శింగరకొండ, శింగరకొండపాలెం లలో ఉదయం 11 గంటల నుండి మధ్యహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

ఎంఈవోకు సేవారత్న అవార్డు

పర్చూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు ఎంఈవో డాక్టర్ అల్లూరి శివకోటేశ్వరరావు విశ్వజననీ సేవారత్న అవార్డుకు ఎంపికయ్యారు. శనివారం పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం, నాంపల్లి, హైదరాబాద్ నందు ప్రతిభా పురస్కారం అందుకోనున్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధ దంపతులు మృతి

● ఐదుగురికి తీవ్రగాయాలు ● క్షతగాత్రులలో ఐదేళ్ల బాలుడు ● కారంచేడు వద్ద లారీని ఆటో ఢీకొనడంతో విషాదం
● గతంలో ఇద్దరు కుమారులను రోడ్డు ప్రమాదాల్లోనే కోల్పోయిన వృద్ధ దంపతులు


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ఆటో


రాఘవయ్య , సింగమ్మ (ఫైల్)

పర్చూరు/చీరాల, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో వృద్ధ దంపతులు దుర్మరణం చెందారు. ఆటోడ్రైవర్‌తో సహా మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఐదేళ్ల బాలుడు కూడా ఉండడం బాధాకరం. ఈ ఘటన కారంచేడులోని గ్యాస్ గోడౌన్ సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. క్షతగాత్రులు తెలిపిన వివరాల ప్రకారం... పర్చూరు మండలం ఉప్పుటూరు గ్రామానికి చెందిన కొమ్మనబోయిన రాఘవయ్య (75), సింగమ్మ (70) దంపతులు. వీరు వైద్యపరీక్షల నిమిత్తం ఆటోలో చీరాలలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు బయల్దేరారు. అదేగ్రామానికి చెందిన సిద్ధబత్తిన రమాదేవి, ఆమె ఐదేళ్ల మనవడు (కుమారుడి కొడుకు) సుహాస్‌కు వైద్యం నిమిత్తం కుమార్తె నట్టువ భార్గవితో కలిసి చీరాల వెళ్లేందుకు అదే ఆటో ఎక్కారు. అప్పటికే ఆటోలో షేక్ నాగూర్‌వలి అనే విద్యార్థి ఉన్నారు. ఆయన చీరాల్లోని ఓ కళాశాలలో ఎంబీఏ చదువుతున్నాడు. ప్రస్తుతం పరీక్షలు రాసేందుకు వెళుతూ ఆటో ఎక్కాడు. ఈక్రమంలో ఆరుగురితో చీరాల కొత్తపేటకు చెందిన ఆటో డ్రైవర్ శివశంకర్ చీరాలకు బయల్దేరాడు. కారంచేడు గ్యాస్ గోడౌన్ వద్దకు వచ్చేసరికి ఆటో అదుపుతప్పి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వృద్ధ దంపతుల్లోని సింగమ్మ అక్కడికక్కడే మృతిచెందారు. క్షతగాత్రులను స్థానికులు రెండు 108 వాహనాల ద్వారా చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ సింగమ్మ భర్త రాఘవయ్య కూడా మృతి చెందాడు. ఆటోడ్రైవర్ శివశంకర్‌ను ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలుకు తరలించారు. మిగిలిన నలుగురు తీవ్రగాయాలతో చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. కారంచేడు ఎస్సై షేక్ ఖాదర్ బాషా వైద్యశాలకు చేరుకొని వివరాలు సేకరించారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఒకే కుటుంబంలో నలుగురిని బలిగొన్న ప్రమాదాలు

పర్చూరు మండలంలోని ఉప్పుటూరుకు కొమ్మనబోయిన రాఘవయ్య, సింగమ్మలు శుక్రవారం రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందగా, వారి ఇద్దరు కుమారులను కూడా గతంలో రోడ్డు ప్రమాదాలు బలిగొన్నాయి. మృతులకు ముగ్గురు కుమారులు కాగా... పెద్దకుమారుడు వెంకటేశ్వర్లు పదేళ్ల క్రితం పర్చూరు-కారంచేడు రోడ్డులోని రామానాయుడు వారధి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మరో కుమారుడు సురేష్ పర్చూరులోని పెట్రోలు బంక్ సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతి చెందాడు. ఇద్దరు కుమారుల మరణంతో ఆ దంపతులు కుంగిపోయారు. ఇప్పుడు ఆ వృద్ధదంపతులు కూడా రోడ్డు ప్రమాదానికి బలయ్యారు. దీంతో ఉప్పుటూరు గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది.


అపస్మారక స్థితిలో ఉన్న సుహాస్, భార్గవి, చికిత్స పొందుతున్న ఆటో డ్రైవర్ శివశంకర్, అపస్మారక స్థితిలో రమాదేవి, గాయపడ్డ నాగూర్ వలీ

తుపాను బాధితులకు అండగా ఉంటాం

ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు


నిత్యావసరాలను అందజేస్తున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

మార్టూరు, అక్టోబరు31(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వం ముందు చూపుతో వ్యవహరించడంతో మొంథా తుఫానును సమర్థవంతంగా ఎదొర్కొన్నామని, తుఫాను బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. తుఫాను కారణంగా మార్టూరు పంచాయతీ పరిధిలోని బాధితులకు శుక్రవారం సాయంత్రం పెద్ద అండరుపాస్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాదితులకు నిత్యావసరాలైన బియ్యం, కందిపప్పు, పంచదార, కూరగాయలు తదితర వస్తువులను ఎమ్మెల్యే ఏలూరి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్ద అండరు పాస్ నుండి హీరోషోరూం వరకు సర్వీసు రోడ్డుపక్కన ఉన్న సైడు కాల్వలను తుపాను ముందు పూడికతీయించడంతో, వర్షపునీరు పెద్ద అండరుపాస్ వద్ద నిలబడలేదని, దీంతో పాటు సర్వీసురోడ్డులో కూడా నీళ్లు నిలబడలేదన్నారు. అదేవిదంగా సెంటర్లో గ్రామ పంచాయతీ వారు పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. అపరిశుభ్రమైన వాతావరణం లేకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ అధికారులకు సూచనలుచేశారు. కార్యక్రమంలో షేక్ రజాక్, కామినేని జనార్దన్, జంపని శ్రీను, కమ్మ శివనాగేశ్వరరావు, తాటి నాగేశ్వరరావు, కన్నెగంటి శ్రీను, తొండెపు ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ధాత్రి కుటుంబసభ్యులకు ఏలూరి పరామర్శ

ఇంకొల్లు : కర్నూలు బస్సు ప్రమాదంలో మృతి చెందిన గన్నమనేని ధాత్రి కుటుంబసభ్యులను ఇంకొల్లు మండలం పూసపాడు గ్రామంలో పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు శుక్రవారం పరామర్శించారు.. ధాత్రి తల్లి వాణి తల్లికి ధైర్యం చెప్పి సానుభూతి తెలిపారు. అనంతరం ధాత్రి చిత్రపటానికి పూలమాలు వేసి నివాళ్లులర్పించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు నాయుడు హనుమంతరావు, పర్చూరు ఏఎంసీ ఛైర్మన్ గుంజి వెంకట్రావు, ఇంకొల్లు పీఏసీఎస్ ఛైర్మన్ కరి శ్రీనివాసరావు స్థానిక టీడీపీ నాయకులు ఉన్నారు. ఇంకొల్లు గ్రామానికి చెందిన షేక్ షబానాకు అత్యవసర చికిత్స కొరకు ఎల్‌వోసీ ద్వారా రూ.50వేల చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఇడుపులపాడులో ఓ వివాహ వేడుకల్లో పాల్గొన్నారు.

రైతులకు ఎమ్మెల్యే పరామర్శ

మార్టూరు : మొంథా తుపాను కారణంగా గ్రామంలో పంటల పరిస్థితి ఎలా ఉందని మండలంలోని ద్రోణాదుల గ్రామ రైతులను ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు వివరాలు అడిగి తెసుకున్నారు. శుక్రవారం ఆయన గ్రామంలో బొడ్డురాయిసెంటరు వద్ద రామాలయం వద్ద రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామంలో మినుము పంట దెబ్బతిన్నట్లు రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అదేవిధంగా మొక్కజొన్న పంట, ఎరువుల వినియోగంపై రైతులు మాట్లాడారు. రైతుసేవాకేంద్రం, సొసైటీల ద్వారా రైతులకు ఎరువులను పంపిణీ చేయాలని రైతులు కోరారు. అదేవిధంగా గ్రామంలో ఏమైనా అంతర్గత రహదారులు, గ్రామానికి వచ్చే రోడ్లు దెబ్బతిన్నాయా ఉంటే వాటి మరమ్మత్తులు విషయంపై ఏలూరి సాంబశివరావు గ్రామస్థులతో మాట్లాడారు. గ్రామంలో పరిశుభ్రమైన వాతావరణం ఉండేవిదంగా నాయకులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పెంట్యాల శ్రీను, ముప్పరాజు ఆంజనేయులు, పి.జానకి రామయ్య, బెల్లంకొండ బాపారావు, చిన్నం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామంతో శారీరక, మానసిక ఆరోగ్యం



వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న రోటరీ సభ్యులు

పర్చూరు : క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తే మానసిన, శారీరక ఉల్లాసంతోపాటు, మెరుగైనా ఆరోగ్యం చేకూరుతుందని ఎస్సై జీ.వీ.చౌదరి అన్నారు. ఏక్తాదివాస్ సందర్బంగా రన్‌ఫర్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పర్చూరు పోలీసు సిబ్బంది నేతృత్వంలో రెండు కిలోమీటర్లు పరుగెత్తి దేశ ఏకతా స్ఫూర్తిని చాటారు. పోలీసులతో పాటు, యువకులు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని రన్‌చేశారు. ఈకార్యక్రమంలో ట్రైనీ ఎస్సై పులి గోపి, ఏఎస్సై సాంబయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ సమైక్యతా దినోత్సవము

అద్దంకి : రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ సమైక్యతా దినోత్సవము నిర్వహించారు. ఈ సందర్భంగా సర్దార్ వల్లభాయ్ 150వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా ఇందిరానగర్‌లోని ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమాలలో రోటరీక్లబ్ అధ్యక్షుడు బాచిన శివపూర్ణచంద్రరావు, కార్యదర్శి అళహరి హరిప్రసాద్, తమ్మన శ్రీనివాసరావు, మహమ్మద్ రఫీ, అద్దంకి లేవి ప్రసాద్, సందిరెడ్డి శ్రీనివాసరావు, చప్పిడి వీరయ్య, డాక్టర్ ఖాజావలి, అంజాద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఉబికి వస్తున్న కన్నీరు!

(5వ పేజీ తరువాయి)

చేనేత పరిశ్రమ తీవ్రంగా దెబ్బతింది. నాలుగు నెలలుగా కురుస్తున్న వర్షాలకు నేతన్నలు పనులు కోల్పోగా, కిందటి నెల కురిసిన ఎడతెరపి లేని వర్షాలు వారిని పీకల్లోతు కష్టాల్లో ముంచేశాయి. ఈ వర్షాల కారణంగా గుంటూరు జిల్లాలోని మంగళగిరి, పేటేరు, ఇసుకపల్లి, రాజోలు, చెరుకుపల్లి, కనగాల, పొన్నూరు, చిలకలూరిపేట, తెనాలి, బాపట్ల జిల్లాలోని ఈపూరుపాలెం, చీరాల, వేటపాలెం, పందిళ్లపల్లి, ఈతముక్కల, వలపర్ల తదితర ప్రాంతాల్లో 25 వేల కుటుంబాలు బాగా దెబ్బతిన్నాయి. చీరాల పరిసర గ్రామాల్లోనే 17 వేల కుటుంబాలు ప్రత్యక్షంగా తుపాను బారిన పడగా.. మంగళగిరిలో 3 వేల కుటుంబాలు, రేపల్లె పరిసర ప్రాంతాల్లో మరో 3 వేల కుటుంబాలు తుపాను ప్రభావానికి గురయ్యాయి. చేతిలో పని ఉన్నా.. అనుకూలమైన వాతావరణం లేకపోవడంతో నేతన్నలు తీవ్రంగా నష్టపోయారు.

ఊటెక్కుతున్న మగ్గం గుంతలు

మొంథా తుపాను ప్రభావం చీరాల పరిసర ప్రాంతాల్లో అత్యంత తీవ్రంగా ఉంది. చీరాల చుట్టుపక్కల ప్రాంతాల్లో మూడు రోజుల పాటు ఎడతెరపి లేకుండా కురిసిన గాలివాన కారణంగా భూగర్భ జలాల నీటిమట్టం విపరీతంగా పెరిగింది. మగ్గాల గుంతల్లోకి నీరు ఊరింది. మగ్గం గుంతల్లో రెండడుగుల మేర చేరిన ఈ నీటిని తోడుకున్నా ఊట వస్తూనే ఉంది. ఈ కారణంగా నీరు పూర్తిగా ఇంకిపోయే వరకూ నేతన్నలకు మగ్గం గుంతలో అడుగుపెట్టే అవకాశం ఉండదు. ఈ నీరు ఇంకడానికి కనీసం రెండు నెలల సమయమైనా పడుతుంది. ఈలోగా మళ్లీ వర్షాలు కురిస్తే పరిస్థితి మరింత దిగజారుతుంది. ఈలోపు మగ్గంపై ఉన్న పడుగు, పేకలు దెబ్బతిని పోతాయి. ఇలా అన్ని విధాలుగా చేనేత కార్మికులు నష్టపోయే అవకాశం ఉంది.

వీడని ముంపు

(5వ పేజీ తరువాయి)

కార్డులు లేకుండా సాగు చేసుకుంటున్న కౌలు రైతుల పరిస్థితే ఏమిటో ఎవరికీ తెలియడంలేదు. ఒక్క బాపట్ల జిల్లా వరకు చూస్తే ఖరీఫ్ ప్రారంభంలో 3,26,000 ఎకరాల సాగు సాధారణ విస్తీర్ణంగా వ్యవసాయశాఖ అంచనా వేసింది. ఈ-క్రాప్‌లో నమోదు చేసింది 2,84,000 ఎకరాలు మాత్రమే. ఇందులో దాదాపు 50,000 ఎకరాల వరకు సాగు చేసుకుంటున్న కౌలుదారు కాకుండా భూయజమాని పేరిటే ఈ-క్రాప్‌లో నమోదైంది. రెండు లక్షల మంది వరకు కౌలురైతులు ఉంటే 80,000 మందికి మాత్రమే సీసీఆర్‌సీ కార్డుల పంపిణీ జరిగింది. ఇదే పరిస్థితి పల్నాడు, గుంటూరు జిల్లాల్లోనూ ఉంది. అంటే అటు ఈ-క్రాప్ నమోదు కాని సాగుదారులు, ఇటు కౌలు రైతులు మొంథా పరిహారానికి అర్హులు కాకుండా పోతున్నారు. సాధారణ విస్తీర్ణానికి, ఈ-క్రాప్ నమోదు లెక్కలకు పొంతన లేకపోవడం కూడా పరిహారానికి అడ్డంకులుగా మారనున్నాయి. ఆంధ్రప్రదేశ్ అగ్రికల్చరల్ ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్(ఏపీఏఐమ్స్) యాప్ ద్వారా మాత్రమే పంట నష్టాన్ని అంచనా వేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. అయితే ఈ-క్రాప్‌లో లేకుండా పంట నష్టపోయిన వివరాలను విడిగా నమోదు చేస్తామని యంత్రాంగం చెబుతున్నప్పటికీ దానిపై స్పష్టత లేదు. మూడు రోజుల్లోనే ఏపీఏఐమ్స్‌లో పంట నష్టం వివరాలన్నీ నమోదు చేయాలనే ఆదేశాలు యంత్రాంగానికి అందాయి. ఇంత స్వల్ప వ్యవధిలో ఇది సాధ్యం కాకపోగా అర్హులైన ఎంతో మంది రైతులకు అన్యాయం జరిగే అవకాశం ఉంది. సాంకేతిక చిక్కులపై సడలింపులు ఇవ్వడంతో పాటు, ఏపీ ఎయిమ్స్ యాప్ నమోదే ప్రామాణికంగా కాకుండా మ్యానువల్ నమోదుకు కూడా ఆస్కారమిస్తేనే రైతులు గట్టెక్కే అవకాశం ఉంది.

ఉదారంగా వ్యవహరించాలి

క్షేత్రస్థాయిలో ఈ-క్రాప్ నమోదుకు, ప్రస్తుతం జరిగిన నష్టానికి పొంతన లేదు. ముఖ్యంగా ఏపీఎయిమ్స్ యాప్ విషయంలో నిబంధనలు సడలించకపోతే రైతులకు పరిహారం ఎండమావే. గతంలో బర్లీ పొగాకును మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసే విషయంలో కూడా ఎయిమ్స్ యాప్‌లో నమోదైన వివరాలకు, ఈ-క్రాప్ లెక్కలకు పొంతన లేకపోవడంతో నిబంధనల విషయంలో ఉదారంగా వ్యవహరించారు. అదేవిధంగా ఇప్పుడు కూడా ఈ-క్రాప్‌లో నమోదు చేసుకోని వారిని కూడా పరిహారానికి అర్హులయ్యే విధంగా చూడాలని రైతులు కోరుతున్నారు.

వర్షానికి దెబ్బతిన్న పంటలను రక్షించుకుందాం..!

● రైతులకు శాస్త్రవేత్తల బృందం సూచన ● నష్టంపై అంచనాలు వేస్తున్న అధికారులు


కొరిశపాడులో మొక్కజొన్నను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త హరిత

మేదరమెట్ల, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): అధిక వర్షాల వల్ల దెబ్బతిన్న మొక్కజొన్న పంటను కొన్ని జాగ్రత్తలను తీసుకోవడం ద్వారా కొంత వరకు రక్షించుకోవచ్చని బాపట్ల అగ్రికల్చర్ రిసెర్చ్ స్టేషన్ శాస్త్రవేత్త టి.హరిత తెలిపారు. శుక్రవారం మండలంలోని కొరిశపాడులో తుపానుకు నేలవాలిన మొక్కజొన్న పంటను అద్దంకి ఏడీఏ ఎఫ్రాయిం, ఏవో రామ్మోహన్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంటలో నిల్వ ఉన్న నీటిని బయటకు పంపడంతో పాటు పంటపై రెండుశాతం యూరియా కానీ, ఒక శాతం పొటాషియం నైట్రైట్ పిచాకారి చేయడం ద్వారా పంట త్వరగా కోలుకుంటుందన్నారు. కాండం కుల్లు, వేరు తెగులు, బూజు తెగులు రాకుండా నివారించడానికి కార్బండిజం 2 నుంచి 3 గ్రాములు లీటరు నీటిలో కలిపి చికారి చేసి తెగులను నివారించవచ్చన్నారు.

బాపట్ల డాట్ సెంటర్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కే.అచ్యుతరాజు మినుము పంట గురించి రైతులకు పలు సూచనలు చేశారు. మినుములో ఇనుపధాతు లోపాన్ని నివారించుకోవడానికి అన్నభేరి 5 గ్రామాలు లేదా, నిమ్మఉప్పు 5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేయడం ద్వారా లోపాన్ని నివారించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఆత్మ అధికారి రామిరెడ్డి, ఆర్‌ఎస్‌సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్నలో నీరు నిల్వలేకుండా చూడండి

అద్దంకి : మొక్కజొన్న పంట లో నీరు నిల్వ ఉండకుండా రైతులు జా గ్రత్తలు తీసుకోవాలని బాపట్ల ఏరువాక కేం ద్రం శా స్త్రవేత్త అచ్యుతరాజు అన్నారు. మండలంలోని గోపాలపురం, చక్రాయపాలెం, చినకొత్తపల్లి గ్రామాలలో తుపానుతో దెబ్బతిన్న మొక్కజొన్న, పత్తి తదితర పంటలను శుక్రవారం శాస్త్రవేత్తలు అచ్యుతరాజు, హరిత, ఏడిఏ ఎఫ్రాయం, ఏవో కొర్రపాటి వెంకటకృష్ణ తదితరులు పరిశీలించారు. రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. మొక్కజొన్న కండెలు నీళ్లలో లేకుండా చూసుకోవాలన్నారు. బూజు వచ్చే ప్రమాదం ఉన్నందున జాగ్రత్తలు పాటించాలన్నారు. కాలువల ద్వారా నీటిని బయటకు పంపించాలన్నారు.

పంట నమోదు ప్రారంభం : ఏవో సుబ్బారెడ్డి

పంటనష్టంపై అంచనాలు

పంగులూరు: మొంథా తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న పొలాల పంటనష్టం అంచనా ప్రారంభించినట్లు ఏవో డి.సుబ్బారెడ్డి తెలిపారు. మండలంలోని ముప్పవరం, కోటపాడు, కొండమూరు గ్రామాలలో తుపాను కారణంగా అధిక వర్షాలకు దెబ్బతిన్న మినుము ఇతర పంటలను ఏవో సుబ్బారెడ్డి శుక్రవారం రైతులతో కలసి పరిశీలించారు. 33 శాతం పైగా పంట దెబ్బతిన్న వివరాలను వ్యవసాయ సిబ్బంది నమోదు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాలలో సిబ్బంది చేపట్టిన పంటనష్టం ఎన్యుమరేషన్ కార్యక్రమాన్ని ఎ.ఓ. పరివీలించారు. రైతులు 33శాతం పైగా దెబ్బతిన్న పంట వివరాలను నమోదు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ గోపి, కిరణ్, రోజి, మస్తాన్, వీఆర్‌వోలు రైతులు పాల్గొన్నారు.

చినగంజాం : మండలంలోని చినగంజాం ప్రాంతంలో సాగుచేస్తున్న వరిపైరును ప్రకృతి వ్యసాయాధికారులు శుక్రవారం పరిశీలించారు. జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగ డీపీఎం ఎస్.హెచ్.హస్సేన్, అడిషనల్ డీపీఎం మోహన్‌లు పొలాలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. చినగంజాంలో బిఆర్‌సీ యాజమాని విజయ్ ఆనంద్‌కుమార్‌ను ప్రొలీకాఫ్ కిట్లు తయారీ స్థితి గురించి డీపీఎం అడిగి తెలుసుకున్నారు. బీఆర్‌సీ నుంచి పప్పులలో పాలీక్రాఫ్ కిట్లు తయారీ చేస్తున్నట్లు ఆనంద్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఏవో ఆర్.చంద్రశేఖర్, బీపీఎంయూ డీపీపీ శ్రీనివాసరావు, ఎన్ఎఫ్ఏ శ్రీవల్లి, చీరాల డివిజన్ మాస్టర్ ట్రైనర్ భారతి, యూనిట్ ఇన్‌చార్జ్ జయమ్మ, మండల పరిధిలోని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.


ముప్పవరం గ్రామంలో మినుమును పరిశీలిస్తున్న ఏవో సుబ్బారెడ్డి, వరిని పరిశీలిస్తున్న ప్రకృతి వ్యవసాయ విభాగం అధికారులు

అవీ..ఇవీ..

బీటీ రోడ్డుకు పడిన గండ్లు

చందలూరు-గంగవరం మధ్య నిలిచిన రాకపోకలు



చందలూరు- గంగవరం మధ్య బీటిరోడ్డులో పడిన గండ్లు

పంగులూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీవర్షాలతో చందలూరు- గంగవరం గ్రామాల మధ్య బీటీరోడ్డుకు గండ్లు పడ్డాయి.ఈ రెండు గ్రామాల మధ్య నడిమివాగు సమీపంలో వరద తాకిడికి రోడ్డు మధ్యలో సగానికిపైగా కోతకు గురైంది. భారీగండ్లతో రాకపోకలు నిలిచిపోయాయి. నిత్యం చందలూరు నుంచి వివిధ పనుల నిమిత్తం ఇంకొల్లుకు వెళ్లే ప్రజలు, కళాశాలకు చేరుకునే విద్యార్థులు కూడా ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తుంటారు. అయితే ప్రస్తుతం వర్షాలకు రోడ్డు దెబ్బతినడంతో ఈ రెండు గ్రామాల రైతులు తమ పంటపొలాలకు రాకపోకలు సాగించలేని పరిస్థితి ఏర్పడింది. ఆర్అండ్‌బీ అధికారులు తక్షణ మరమ్మతులు చేపట్టి రాకపోకలకు అంతరాయం లేకుండా చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

శతాధిక వృద్ధురాలు నాగరత్నమ్మ మృతి



నాగరత్నమ్మ(ఫైల్)

నాగులపాలెం(పర్చూరు), అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు మండల పరిధిలోని నాగులపాలెం గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు కొల్లా నాగరత్నమ్మ(106) శుక్రవారం మృతి చెందారు. ఆమెకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. పది పదులకు పైగా వయస్సు ఉన్న నాగరత్నమ్మ చివరి వరకు ఆరోగ్యవంతమైన జీవనం సాగించారు. తన పనులను తానే చేసుకుంటూ నేటి యువతరాన్ని స్ఫూర్తిగా నిలిచారు. చివరి రోజుల వరకు ఆమె స్వయంగా వంటచేసుకోవడం ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. నాగరత్నమ్మ మనవళ్లు, మనుమరాళ్ళు విదేశాల్లో ఉన్నత స్థాయిలో ఉన్నారు. శనివారం గ్రామంలో ఆమెకు అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుమారుడు కొల్లా సుబ్బారావు తెలిపారు.

కోరం లేక కౌన్సిల్ సమావేశం వాయిదా



ఆరుగురు కౌన్సిలర్‌లతో ఖాళీగా సమావేశం హాలు

● కార్యాలయం బయట ఇద్దరు కౌన్సిలర్ల నిరసన

చీరాల, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : అత్యవసర మున్సిపల్ కౌన్సిల్ సమావేశం శుక్రవారం జరగాల్సి ఉండగా, వాయిదా పడింది. 60 అంశాలతో సమావేశం నిర్వహించేందుకు అధికారులు ప్రకటన విడుదల చేశారు. అలాగే అనుకున్న రీతిలో ఉదయం 11 గంటలకే మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు, కమిషనర్ అబ్దుల్ రషీద్, డి రఘురామ్, టీపీవో శ్రీనివాసరావు, ఏఈ రవికుమార్‌లు హాజరయ్యారు. అయితే దాదాపుగా అరగంట గడిచిన అనంతరం కౌన్సిలర్లు సల్లూరి సత్యానందం, మామిడాల రాములు, గోలి స్వాతి, మరో ముగ్గురు తప్ప మిగిలిన సభ్యులు గైర్హాజర య్యారు. దీంతో చైర్మన్ సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ప్రకటించి హాలు నుంచి బయటకు వెళ్లారు. ఇదిలా ఉంటే అధికార పార్టీకి చెందిన 31 వార్డు కౌన్సిలర్ సత్యానందం, గుంటూరు ప్రభాకరరావు చైర్మన్‌పై అసహనం వ్యక్తం చేస్తూ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు.

పశువుల యజమానులకు దాణా పంపిణీ



పశువుల యజమానులకు దాణా పంపిణీ చేస్తున్న అధికారులు

పాపాయిపాలెం(చీరాల), అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ నేపథ్యంలో ఇబ్బందులు ఎదుర్కొన్న పశువుల యజమానులకు పశుసంవర్ధకశాఖ దాణా అందజేస్తోంది. ఈ క్రమంలోనే శుక్రవారం వేటపాలెం మండలం పాపాయిపాలెం గ్రామంలో 200 మంది రైతులకు దాణా అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డా.వేణుగోపాల్, ఏడీ చిట్టిబాబు, పశువైద్యులు డా.పుష్పలత, వాసు, పులి హరికృష్ణ, పోతురాజు, నారాయణ, బొమ్మిడి నాగరాజు, గ్రామస్థులు పాల్గొన్నారు.

3న మండల సర్వసభ్య సమావేశం

యద్దనపూడి,(మార్టూరు) అక్టోబరు31 (ఆంధ్రజ్యోతి):యద్దనపూడి ఎంపీడీవో కార్యాలయంలో ఈ నెల 3న సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి వివిధ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు అందరూ హాజరుకావాలని ఆయన తన ప్రకటనలో కోరారు.

విమర్శలు, ప్రతివిమర్శల మధ్య కౌన్సిల్ సమావేశం

నాడు వివక్ష చూపించి.. నేడు నిందలా..



అసహనం వ్యక్తం చేస్తున్న చైర్‌పర్సన్, మాట్లాడుతున్న కౌన్సిలర్లు

అద్దంకి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): అద్దంకి మున్సిపల్ సాధారణ సమావేశం విమర్శలు, ప్రతివిమర్శల మధ్య సాగింది. అద్దంకి మున్సిపల్ సమావేశం శుక్రవారం చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ అధ్యక్షతన నిర్వహించారు. అజెండాలోని మొత్తం 27 అంశాలను ఆమోదించారు. అయితే సమావేశం ముగిసే సమయంలో వైసీపీ కౌన్సిలర్లు బాలు, కోటేశ్వరరావులు తమ వార్డులలో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించడం లేదని అన్నారు. దీనికి సమాధానంగా కమిషనర్ రవీంద్ర ఆయా వార్డులలో చేసిన అభివృద్ధి పనుల గురించి వివరించారు. వైసీపీ కౌన్సిలర్ల విమర్శలకు టీడీపీ మహిళా కౌన్సిలర్లు కంపా రజనీ, మాగులూరి తిరుపతమ్మలు సమాధానం ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు టీడీపీ కౌన్సిలర్లు ప్రాతినిధ్యం వహించే వార్డులకు ఎలాంటి నిధులు కేటాయించకుండా తీవ్ర వివక్ష చూపించారన్నారు. కాని ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అన్ని వార్డు లకు సమ ప్రాధాన్యం ఇస్తూ నిధులు కేటాయి స్తోందన్నారు. అదేసమయంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ సహకారంతో అద్దంకి పట్టణంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. వైసీపీ కౌన్సిలర్లు బాలు మాట్లాడుతూ మినీ బైపాస్ రోడ్డు నిర్మాణం పీపీపీ పద్ధతిలో నిర్మిస్తే మున్సిపాలిటీ నుంచి ఎలా చెల్లింపులు సాధ్యం అవుతాయని ప్రశ్నించారు. అద్దంకి మున్సిపాలిటీ ఆదాయం పరిగణలోకి తీసుకోకుండా పీపీపీ విధానంలో మినీ బైపాస్ రోడ్డు నిర్మాణం ఎలా చేస్తారన్నారు. టీడీపీ, వైసీపీ కౌన్సిలర్ల వాదో పవాదనలతో కొద్దిసేపు గందరగోళం నెలకొంది.

తుపాను బాధితులకు అండగా ప్రభుత్వం

పలు గ్రామాల్లో ఎమ్మెల్యే కొండయ్య పర్యటన



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : తుపాను బారిన పడిన రైతులకు ప్రజా కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే కొండయ్య చెప్పారు. శుక్రవారం చీరాల మండల పరిధిలోని వాడరేవు, బోయినవారిపాలెం, కావూరివారిపాలెం ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. ఈసందర్భంగా ఆయా ప్రాంతాల్లోని వరి, వేరుశనగ పంట లను పరిశీలించి రైతులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే అధికారులు నష్టానికి సంబంధించిన అంచనాలను సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ప్రతిఒక్కరికి పారదర్శకంగా సాయం అందుతుందన్నారు. నిత్యవసరాలు పంపిణీ చేశా రు. అంతకుముందు కీర్తివారిపాలెం జాతీయ రహదారి నుంచి వాడరేవు జీరో పాయింట్ వరకు పోలీసులు నిర్వహించిన ఏక్తాదివస్ యూనిటీ రన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. అలా గే వారితో నడిచి జాతీయ ఐక్యతను చాటారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించనున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే వెంట పలువురు అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తిమ్మాయపాలెం పొలాలకు ఏటా వరద ముప్పు

తీవ్రంగా నష్టపోతున్న రైతులు



తిమ్మాయపాలెం వద్ద పొలాలలో నిలిచిన వర్షపు నీరు

అద్దంకి, అక్టోబరు31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాయపాలెం వద్ద పొలాలకు వరద ముప్పుతో రైతులకు ఏటా తిప్పలు తప్పడం లేదు. దర్శి రోడ్డుకు ఇరువైపులా ఉన్న సుమారు 200 ఎకరాల పొలాలలోకి చిన్నపాటి వర్షం కురిసినా నీరు చేరి బయటకు వెళ్ళే మార్గం లేక నిలిచిపోతోంది. పంటలు సాగు చేసే ముందు వర్షాలు పడితే ఇక నెలల తరబడి వేచి ఉండాల్సిందే. పంటలు సాగు చేసిన వర్షాలు పడితే పంటను వదులుకోవాల్సిందే. తిమ్మాయపాలెం ఎత్తిపోతల పథకం కాలువ నుంచి దర్శి రోడ్డుకు రెండు వైపులా భూమి ఏటవాలు లేకుండా చదునుగా ఉంది. దీనికి తోడు దర్శి రోడ్డులో ఎక్కువ కల్వర్టులు కూడా ఏర్పాటు చేయక పోవడంతో నీరు ఎక్కడి కక్కడే నిలిచి పోతోంది. వరద నీరు పోయేందుకు ప్రత్యేకంగా కాలువ, వాగు లేక పోవడంతో పొలాలలో నుంచి ప్రవహించాల్సి ఉంది. పొలాలలో నుంచి వెళ్లే నీరు కుంకుపాడు రోడ్డు వరకు పోయి నిలిచిపోతున్నాయి. మెట్ట పంటలు ఎలాగూ సాగు చేసే అవకాశం లేదు. వరి సాగు చేసినా నీరు నిలిచి ఉండడంతో ఎదుగుదల లేకుండా కుళ్లిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో చిన్నపాటి వర్షం కురిసినా పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. ప్రత్యామ్నాయంగా వరద నీరు పోయే వీలుగా కాలువ ఏర్పాటు చేస్తే రైతులందరికి ప్రయోజనం ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

జలదిగ్బంధంలో పెదగంజాం



పోలేరమ్మ గుడి సమీపంలో రోడ్డుపై వరదనీరు

చినగంజాం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి) : వర్షాలు ఆగినా మండలంలోని పెదగంజాం గ్రామం ఇంకా జలదిగ్బందంలోనే ఉంది. పెదగంజాం గ్రామానికి చుట్టుపక్కల వరద నీరు రావడంతో మూడు రోజుల నుంచి గ్రామానికి రాకపోకలు స్తంభించాయి. పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని బుచ్చిగుంట సమీపంలోని మురుగుకాలువకు వరద రావడం, రైల్వేస్టేషన్ అండర్‌పాస్‌లోనికి వర్షపునీరు భారీగా చేరడం, బకింగ్‌హాం కాలువకు వచ్చిన వరదనీరు గ్రామంలోని పోలేరమ్మ గుడి నుంచి ఎన్టీఆర్ వారిధి వరకు ఉన్న రహదారిపై ఉధృతంగా ప్రవహిం చడంతో గ్రామానికి రాకపోకలు నిలిచిపో యాయి. గ్రామంలోనికి రాకపోకలను తమ సిబ్బంది నిలువరిస్తున్నట్లు తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు శుక్రవారం తెలిపారు. మున్నంవారిపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని రాజమాతకాలనీ లోనికి వచ్చిన వరద నీటిని, రైల్వే అండర్‌పాస్‌లో నిలిచిన వర్షపు నీటిని మోటార్ల ద్వారా బయటకు పంపుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.ధనలక్ష్మి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



రాజమాత కాలనీలో వరద నీటిని పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎంపీడీవో

పోలూరు వాగుకు తగ్గని ఉధృతి

యద్దనపూడి,(మార్టూరు) : మొంథా తుఫాను వరదనీరు యద్దనపూడి మండలంలోని పోలూరు వాగులో శుక్రవారం కూడా కొనసాగుతోంది. ఈ వాగులో నీరు కొంతమేర తగ్గినప్పటికీ పోలూరు గ్రామానికి మాత్రం ప్రజల రాకపోకలు నిలిచిపోయాయి. మూడు రోజుల నుంచి పోలూరు గ్రామానికి యద్దనపూడి, ఇతర గ్రామాలకు ప్రజల రాకపోకలు స్తంభించాయి. అదేవిధంగా శనివారం ఉదయం వరకు వాగు ఉధృతి కొనసాగే అవకాశం ఉందని, శనివారం సాయంత్రానికి ప్రజల రాకపోకలు జరిగే అ వకాశం ఉందని పోలూరు గ్రామస్థులు పేర్కొటున్నారు. యద్దనపూడి నుండి పర్చూరుకు, యనమదల నుంచి అనంతవరం గ్రామానికి వరదనీరు ఉధృతి తగ్గడంతో యధావిధిగా ప్రజల రాకపోకలు కొనసాగుతున్నాయి.

వరద నీటిలోనే ప్రయాణాలు



చంటిబిడ్డతో రోడ్డుదాటుతున్న స్వర్ణవాసులు

కారంచేడు (పర్చూరు), అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలతో వాగులు, చెరువులు, కాలువలు పొంగి పొరలి ఆయా గ్రామాలు జలదిగ్బంధంలో ఉండగా, రాకపోకలు నిలిచి పోయాయి. వర్షం ఆగిపోయినా వాగులు, కాలువల్లో నీటి ఉధృతి తగ్గలేదు. దీంతో ఆయా ప్రధాన కాలువలు పొంగి పొరలుతున్నాయి. ఎక్కడ చూసినా పంట పొలాలు సముద్రాన్ని తలపించేలా నీటితో నిండిపోయి ఉన్నాయి. గ్రామాల నలు దిక్కులను వరద నీరు ముంచెత్తటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు నెలకొన్నాయి. కారంచేడు - స్వర్ణ గ్రామాల మధ్య కొమ్మమూరు కాలువకు గండ్లు పడటంతో రోడ్లపై నుంచి నీటి ప్రవాహం కొనసాగుతోంది. పంట పొలాలు సైతం నేటికి వరద నీటితో నిండి ఉన్నాయి. దీంతో ఆయా మార్గాల నుంచి ప్రజలు అతికష్టం మీద ప్రవహిస్తున్నా నీటిలోనే చంటి బిడ్డలతో రాకపోకలు సాగిస్తున్నారు.

జాండ్రపేట వాసులకు తీరిన కరెంట్ కష్టాలు

● కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించిన అధికారులు



నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న డీఈ థామస్

జాండ్రపేట (చీరాల), అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండల పరిధిలోని జాండ్రపేట సిపాయిపేట వాసులకు కరెంట్ కష్టాలు తీరాయి. రూ.8 లక్షల విలువైన నూతన విద్యుత్ ట్రాన్స్‌పార్మర్‌ను శుక్రవారం డిఈ జాన్‌థామస్ ప్రారంభించారు. గ్రామంలో గతంలో లో-ఓల్టేజీ సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడినట్లు అధికారులు తెలిపారు. ఇకపై అంతరాయం సమస్యలు ఉండవన్నారు. కార్యక్రమంలో డీఈఈ హరిప్రసాద్, డీ2 అసిస్టెంట్ ఇంజనీర్ శంకర్, ఇతర విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బలరాం స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు

తోటవారిపాలెం (చీరాల), అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తేళ్ల రాంబాబు తెలిపారు. బలరాం జన్మదిన వేడుకలు సందర్భంగా శుక్రవారం మండల పరిధిలోని తోటవారిపాలెం యానదికాలనీ వాసులకు పండ్లు పంపిణీ చేశారు. గతంలో అన్నదానాలు నిర్వహించినట్లు రాంబాబు వివరించాడు.

తుపాను బాధితులకు సరుకుల పంపిణీ

మార్టూరు, అక్టోబరు31(ఆంధ్రజ్యోతి):మండలంలోని కోలలపూడి గ్రామంలో 12 మంది తుపాను బాధితులకు 25 కిలోలు బియ్యం,నిత్యావసరవస్తువులను శుక్రవారం పంపిణీ చేశారు. జడ్పీ హైస్కూల్‌లోని పునరావాసకేంద్రంలో తలదాచుకున్న బాధితులకు కలెక్టర్ ఆదేశాలు మేరకు సరుకులను పంపిణీ చేశామని సర్పంచ్ ఎం.సతీష్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సొసైటీ అధ్యక్షులు తాటి నాగార్జున, కందిమళ్ల కొండలరావు, చందు, కనుమూరి చిన్న, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మేము సైతం ప్రజాసేవలో..



నిత్యావసరాలు అందజేస్తున్న దుకాణదారులు, టీడీపీ శ్రేణులు

చీరాల, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : తుపాను ప్రభావంతో ఎంతో మంది నిరాశ్ర యులుగా మారారు. అయితే అప్పటికే ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకునేందుకు సహాయక చర్యలు చేపట్టింది. అయితే మేము సైతం ప్రజాసేవల్లో అంటూ ఓ మొబైల్ దుకాణ దారుడు ముందుకు వచ్చాడు. పట్టణంలోని త్రినేత్రం మొబైల్ దుకాణ దారుడు మోకాళ్ల లోతు నీళ్లల్లో ఉన్న కొత్తపేట పంచాయతీ కృపానగర్‌లో తుఫాన్ బాధితులకు టీడీపీ కార్యకర్త గవిని వెంకటేశ్వర్లుతో కలిసి దుకాణ దారుడు సుబ్బ యాదవ్ సుమారు 50 మందికి నిత్యవసరాలు అందజేశారు. వారి వెంట వెంకటేశ్వర్లు, షేక్ అహ్మద్, గోపీ తదితరులు ఉన్నారు.

పోలీసు అమరుల వీరుల త్యాగాలు ఎనలేనివి

● చివరిరోజు రక్తదాన శిబిరం ఏర్పాటు



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న సీఐ సుబ్బారావు, ఎస్సై రాజ్యలక్ష్మి

చీరాల, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : పోలీసు అమరవీరుల త్యాగాలు ఎనలేనివని వన్‌టౌన్ సీఐ సుబ్బారావు అన్నారు. డీఎస్పీ ఎండీ మొయిన్ ఆదేశాల మేరకు శుక్రవారం ఎస్సై రాజ్యలక్ష్మీతో కలిసి స్థానిక సెయింట్ మార్క్స్ లూథరన్ జూనియర్ కళాశాలలో పోలీసుల రక్తదాన శిబిరం నిర్వహించారు. దీంతో పలువురు సిబ్బంది హాజరై రక్తదానం చేశారు. కార్యక్రమంలో పలువురు పోలీసులు పాల్గొన్నారు.

పాఠశాలకు ఇన్వర్టర్ బహూకరణ



ఇన్వర్టర్‌ను బహూకరిస్తున్న పూర్వవిద్యార్థిని అనంతలక్ష్మి

పంగులూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదవాడ ఉన్నత పాఠశాలకు పూర్వవిద్యార్థిని, కల్లంవారిపాలెం సచివాలయ ఏఎన్ఎం పోలిశెట్టి అనంతలక్ష్మి ఇన్వర్టర్, బ్యాటరీ బహూకరించారు. రూ.26వేల విలువైన ఇన్వర్టర్‌తో పాటు బ్యాటరీని శుక్రవారం పాఠశాల హెచ్ఎం పూసల రఘురామయ్యకు అందజేశారు. తన తల్లిదండ్రులు గుండా సాంబశివరావు, వెంకటరత్నాల ఆశయాలు తనను ముందుకు నడిపిస్తున్నాయని అనంతలక్ష్మి తెలిపారు. బాల బాలికలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించి క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలన్నారు. తమ పాఠశాలకు విలువైన ఇన్వర్టర్ సమకూర్చిన పూర్వ విద్యార్థిని అనంతలక్ష్మికి హెచ్.యం, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు చిలుకూరి శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ కుటుంబాలకు వంటగ్యాస్ పంపిణీ



వంటగ్యాస్ కనెక్షన్ అందజేస్తున్న గ్రామవికాస్‌సొసైటీ ప్రతినిధులు

ఇంకొల్లు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుద్దుకూరు గ్రామంలో గ్రామ వికాస్ సొసైటీ ద్వారా 12 కుటుంబాలకు ఉచిత వంట గ్యాస్ కనెక్షన్లను అందజేశారు. గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ. రాయిణి నళిని సుబ్బరామయ్య తన పుట్టినరోజు సందర్భంగా సమకూర్చిన రూ.75వేల నిధులతో 12 కుటుంబాల వారికి ఇండేన్ వంటగ్యాస్ శుక్రవారం గ్రామవికాస్ సొసైటీ ప్రతినిధులు పంపిణీ చేశారు. విద్యా కార్యక్రమాలతో పాటు పేదల సంక్షేమమే లక్ష్యంగా గ్రామవికాస్ సొసైటీ తమ సేవలు విస్తరిస్తుందని ప్రతినిధి చెన్నుపాటి జనార్ధనరావు అన్నారు. కార్యక్రమంలో పిల్లి బెన్నీ, పలువురు గ్రామవికాస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మొంథా ప్రభావంతో కూలిన నూరేళ్ల మర్రిచెట్టు



కూలిన మర్రి చెట్టు

ఇంకొల్లు, అక్టోబరు 31, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దుద్దుకూరు గ్రామంలో పోలేరమ్మ గుడి వద్ద చెరువుకట్టపై ఉన్న 100 సంవత్సరాల చరిత్ర కలిగిన మర్రి చెట్టు తుఫాన్ కారణంగా కుప్పకూలింది. మంగళవారం అర్ధరాత్రి ఎడతెరపి లేకుండా కురిసిన వర్షానికి బుధవారం ఉదయం చెరువులోకి పడిపోయింది. వందేళ్ల క్రితం నూజెళ్లపల్లెకు చెందినన ఓ వ్యక్తి చెరువుకట్టపై కూర్చునేందుకు రావి, మర్రి చెట్లు నాటారని అది మహావృక్షంగా పెరిగిందన్నారు. చెట్టు కిందే పిండప్రదానాలు చేసుకునేందుకు, విశ్రాంతి తీసుకునేందుకు ఉపయోగకరంగా ఉన్న చెట్టు మొంథా తుఫాన్ దెబ్బకు కుప్పకూలిందని గ్రామస్థులు తెలిపారు. చాలా ఏళ్ల చరిత్ర కలిగిన చెట్టు కూలిపోవడంతో గ్రామంలో చర్చనీయాంశమైంది. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పడిపోయిన మర్రి చెట్టును పరిశీలించారు. అనంతరం కోతకు గురైన చెరువుకట్టను పరిశీలించి చెరువుకట్ట బలోపేతం చేయాలని అధికారులకు సూచించారు.

ఎత్తిపోతలు నిర్మిస్తే తీవ్ర నష్టం



కారంచేడులో సమావేశంలో పాల్గొన్నరైతులు

కారంచేడు(పర్చూరు), అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల జిల్లా, అప్పాపురం వద్ద కొమ్మమూరు కాలువపై లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ నిర్మిస్తే దిగువన ఉన్న కారంచేడు భూములకు సాగునీటితోపాటు, తాగునీటికి తీవ్ర ఇబ్బందులు వస్తాయని కారంచేడు మండల రైతులు పేర్కొన్నారు. గుంటూరు జిల్లా కాకుమానుకు చెందిన ఓ పారిశ్రామికవేత్త పీ4 ముసుగులో కొమ్మమూరు కాలువ ఎగువ ప్రాంతంలో ఉన్న అప్పాపురం మెయిన్ ఛానల్ చివరి ఆయకట్టు భూములకు సాగునీరు అందడం లేదని సాకుతో ఈలిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారన్నారు. దీనికి వ్యతిరేకంగా శుక్రవారం కారంచేడు సాయిబాబా మందిర అతిథి భవనంతో రైతులతో సమావేశం నిర్వహించారు. త్వరలో ఏర్పాటు చేసే కార్యాచరణపై సభ్యుల అభిప్రాయాలు స్వీకరించారు. కార్యక్రమంలో యార్లగడ్డ శ్రీనివాసరావు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు యార్లగడ్డ సుబ్బారావు, పోతిని నాగేశ్వరరావు, మాలెంపాటి చిననారాయణ, కొల్లా సుబ్బారాయుడు, చాగంటి సాంబయ్య, వాసు, పాలేటి మల్లి తదితరులు పాల్గొన్నారు.